# మహనీయుల బాట

2



Hamare Buzurg - Part - 2
(Telugu)

# మహనీయుల బాట

## (రెండవ భాగం)

మూలం:
మాయల్ ఖైరాబాది

అనువాదం:
సయ్యద్ హుసైన్

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్
సందేశభవనం, ఛత్తాబజార్,
హైదరాబాద్-500 002.

**Mahaneeyula Baata - 2**
**Hamare Buzurg - Part-II (Telugu)**

**TIP Series No. 67**

Writer : **Mayal Khairabadi**

Translator : **Syed Hussain**

All Rights Reserved with publishers

3rd Edition : February 2017

Copies : 1000

Price : **Rs.35**

ISBN : 81 - 86826 - 70 - X

Published by **Telugu Islamic Publications Trust (Regd.)**
Sandesha Bhavanam,Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Phones: 040-24564583, 24576237
e-mail: geeturaiweekly@gmail.com

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

# నలుగురు ఫిఖా (ధర్మశాస్త్రం) ఇమామ్‌లు

ఈ పుస్తకంలో ఫిఖా విద్యలో ప్రసిద్ధి చెందిన నలుగురు ఇమామ్‌ల గురించే చర్చించబడింది. సామాన్య ముస్లిమ్‌లకు నిత్య జీవితంలో అడుగడుగునా పనికివచ్చేలా వీరు ఈ ఫిఖాను ఖుర్‌ఆన్, హదీసుల ఆధారంగానే రూపొందించారు.

ఈ నలుగురు పెద్దల ద్వారా ఇలాంటి బృహత్తర కార్యాన్ని నిర్వహింపజేసినందుకు దైవానికి కృతజ్ఞతలు. వీరి కృషిని అంగీకరించి వారికి పరలోకంలో ఉన్నత స్థానాన్ని ప్రసాదించాలని ఇంకా మనకు కూడా వారి అడుగుజాడల్లో నడుచుకునే సద్బుద్ధిని ఇవ్వాలని దైవాన్ని వేడుకుంటున్నాను.

– మాయల్ ఖైరాబాది

# విషయసూచిక


1. ఇమామె ఆజమ్ హజ్రత్ అబూ హనీఫా (రహ్మాలై) 05

2. ఇమామ్ మాలిక్ (రహ్మాలై) 26

3. ఇమామ్ షాఫయి (రహ్మాలై) 30

4. ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రహ్మాలై) 54

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడయిన అల్లాహ్ పేరుతో

# ఇమామె ఆజమ్
# హజ్రత్ అబూ హనీఫా (రహ్మాలై)

హజ్రత్ అబూ హనీఫా (రహ్మాలై) ఫిఖా (ధర్మశాస్త్రం)లో అందరికంటే ఆద్యులైన ఇమామ్. హరామ్ (అధర్మమయినది) ఏదో, హలాల్ (ధర్మ సమ్మత మయినది) ఏదో, ఏది చేయవచ్చో, మరేది చేయకూడదో, ఇంకా ఏది విధిగా నిర్ణయించడం జరిగిందో, మరేది విధికాదో మొదలైన అనేక విషయాలు తెలుసుకునేందుకు వీరి ఫిఖాకు పూర్వం సామాన్య ముస్లిమ్‌లకు ఏ విధమయిన గ్రంథం లేదు. ముస్లిమ్‌లపై అబూ హనీఫా (రహ్మాలై) గారి మరో మేలు ఏమిటంటే వారు ఖుర్‌ఆన్, హదీస్‌ల ఆధారంగా ఫిఖా సమస్యల్ని ఏరి వాటిని ఓ క్రమపద్ధతిలో క్రోడీకరించారు. మొత్తం మీద వీరు ముస్లిమ్‌లకు ఎలాంటి పుస్తకాన్ని అందించారంటే, దీని ద్వారా సామాన్య ముస్లిమ్ కూడా- హలాల్, హరామ్‌లంటే ఏమిటి? విధిగా నిర్ణయమయిందేదీ? విధి కానిదేదీ? వగైరా విషయాల్ని ఎంతో సులువుగా తెలుసుకోగలడు. ఇలాంటి గొప్ప కార్యానికి వీరు ఎందుకు, ఎలా పూనుకున్నారు? దాని వైపు ఎలా ఆకర్షించబడ్డారు? ఇదో పెద్ద ఆసక్తికరమైన, గుణపాఠయోగ్యమయిన గాథ. దీన్ని మీరూ తెలుసుకోండి.

కూఫాలో సాబిత్ అనే పేరుగల ఓ వ్యాపారి ఉండేవారు. దైవం వారికి ఓ తెలివయిన కుమారుణ్ణి ప్రసాదించాడు. వీరు తన కుమారునికి 'నౌమాన్' అని నామకరణం చేశారు. ఈ నౌమానే పెరిగి పెద్దవాడై విద్యనభ్యసించి, ఫిఖా (ధర్మశాస్త్రం)లో సుప్రసిద్ధుడయిన ఇమామ్‌గా తయారయ్యారు. వీరే ఇమామె ఆజమ్‌గా ప్రసిద్ధిచెందిన అబూ హనీఫా (రహ్మాలై). వీరి విషయాల్నే నేడు మీకూ తెలియజేయాలనుకుంటున్నాం.

ఇమామె అజమ్ (రహ్మాలై) హి[జీ 80వ శకంలో జన్మించారు. కొంచెం పెద్దవారయ్యాక ఇంటివద్దనే వీరికి విద్యాభ్యాసం మొదలెట్టారు వీరి తండ్రి. ఆ సమయంలో కూఫాలో గొప్ప గొప్ప పాఠశాలలుండేవి. అయినా సాబిత్ తన కుమారుణ్ణి ఏ పాఠశాలకూ, మరే ఇమామ్ లేక ఆలిమ్ వద్దకు పంపక ఇంటి వద్దనే వారికి విద్య నేర్పేవారు. చదువుకోగా మిగిలిన సమయంలో వీరి తండ్రి వీరికి వ్యాపార విధానాలు, అందులోని లోతుపాతుల్ని తెలియజేసేవారు. వీరు పదహారు సంవత్సరాల వయస్సులో ఉన్నప్పుడు వీరి తండ్రి పరమపదించారు. అప్పటికి ఇమామ్ సాహెబ్ వ్యాపార వ్యవహారాలన్నింటినీ నేర్చుకుని ఉన్నారు. అందువల్ల, తండ్రి మరణానంతరం వ్యాపారాన్ని చేతిలోకి తీసుకోగలిగారు. ఆపై కొద్ది రోజుల్లోనే వారు తన ఆదాయాన్ని వృద్ధి చేసుకోగలిగారు. వ్యాపారంతోపాటు వీరు బట్టలు తయారుచేసే ఓ కార్ఖానాను కూడా ప్రారంభించారు. అందులో చాలా విలువైన వస్త్రాలు తయారై, సుదూర ప్రాంతాలకు సరఫరా అయ్యేవి. ప్రజలు వాటిని ఎంతో ఆసక్తితో కొనేవారు.

ఇలా రెండు మూడేళ్ళు గడిచాక, వీరికి 19 ఏళ్ళ ప్రాయం వచ్చింది. ఓ రోజు మరో వ్యాపారిని కలుసుకునేందుకు ఓ చోటికి వెళ్తున్నారు. దారిలో కూఫాలో ప్రసిద్ధి చెందిన ఇమామ్ అల్లామా షాబి (రహ్మాలై) కలిశారు. ఇమామ్ సాహెబ్ వారికి సలామ్ చేయగా అల్లామా సాహెబ్ ప్రతి సలామ్ చేసి, "ఎక్కడికెళుతున్నావు కుమారా?" అని అడిగారు. "ఓ వ్యాపారితో కలిసేందుకు వెళ్తున్నా"నని సమాధానమిచ్చారు ఇమామ్ సాహెబ్. ఇది విని అల్లామాగారు అన్నారు, "కుమారా! నా ఉద్దేశ్యం మీరు చదువుకోవడానికి ఎవరి వద్ద కెళుతున్నారని?" అల్లామా గారి ఈ మాటకు ఎంతో సిగ్గుపడి మళ్ళీ అబూ హనీఫా సమాధానంగా, "నేనెవరి వద్దనూ విద్యనభ్యసించడం లేదు" అని అన్నారు.

ఇది విన్న అల్లామా గారు ఎంతో ప్రేమవాత్సల్యాలతో, "మీరు ఎంతో తెలివయినవారిలా కన్పిస్తున్నారు, ఆలిమ్‌ల చెంత కూర్చుంటూ ఉండండి, దైవం మీకు ఎంతో గౌరవాన్ని ప్రసాదిస్తాడు" అని అన్నారు. అల్లామా గారి ఈ హితబోధ ఇమామ్ గారిపై ఎంతో ప్రభావాన్నేసింది. ఇంకేముంది, వారు ఆ వ్యాపారిని కలుసుకోక, అక్కణ్ణుంచే తిరిగి ఇంటికి వచ్చారు. అప్పటికి వారి

తల్లి జీవించే ఉన్నారు. ఆమె ఎంతో గుణవతి. ఆమెతో జరిగిన విషయాన్ని విన్నవించారు ఇమామ్ గారు. అంతా విని, ఆమె కూడా సంతోషంతో, "కుమారా! నీవు తప్పనిసరిగా ధార్మిక విద్యను అభ్యసించాల్సిందే మరి" అని అన్నారు. తల్లి ఆశీర్వాదం, ఆజ్ఞను తీసుకుని వారు అల్లామా హమ్మాద్ (రహ్మలై) సన్నిధికి చేరారు. ఇమామ్ హమ్మాద్ (రహ్మలై) కూఫాలోనే అన్నింటికంటే గొప్పదయిన పాఠశాలను నడుపుతున్నారు. వారు హజ్రత్ అబూ హనీఫా (రహ్మలై)ను తన పాఠశాలలో చేర్చుకున్నారు. ఇక వారివద్ద విద్య నేర్చుకోవడం మొదలెట్టారు అబూ హనీఫా. దైవం వీరికి ఎంతో అవగాహనా శక్తిని ప్రసాదించాడు. వీరికి జ్ఞాపక శక్తి కూడా అధికమే. ప్రతి విషయాన్ని శ్రద్ధతో విని దాన్ని జ్ఞాపకముంచుకునేవారు. ఈ విధంగా శ్రమ, శ్రద్ధాసక్తులతో చదువు నేర్చుకోవడం వల్ల కేవలం రెండే రెండు సంవత్సరాల్లో తతిమ్మా విద్యార్థులందరిలోకెల్లా మిన్నగా రాణించగలిగారు. వీరి కృషికి హమ్మాద్ (రహ్మలై) కూడా ఎంతో మెచ్చుకున్నారు. అంతేకాదు, ఆ పాఠశాలలో విద్య నేర్చుకుంటూనే అబూ హనీఫా (రహ్మలై) కూఫాలోని గొప్ప గొప్ప ఆలిమ్‌లు, ఇమామ్‌ల వద్దకు వెళ్ళేవారు. పాఠశాల సమయం ముగిసిన తరువాత ఇతర సమయాల్లో ఒక్కోసారి వీరు ఇమామ్ షాబి (రహ్మలై) సన్నిధికి, మరోసారి ఇమామ్ అబూ ఇస్‌హాఖ్ దగ్గరికి, ఒక్కొక్కప్పుడు హజ్రత్ హష్షామ్ బిన్ అర్‌వాహ్ సన్నిధిలో హాజరయ్యేవారు. ఇదే విధంగా ఇంకితర ఆలిమ్‌ల వద్దకు కూడా వెళ్ళి ఎన్నో విషయాల్ని నేర్చుకునేవారు. రెండేళ్ళ కాలంలోనే వీరి పేరు కూఫాలో మారుమ్రోగింది. ప్రజలు వారిని చూసి "ఇన్షా అల్లాహ్ (దైవం తలిస్తే) ఒకానొక రోజు నౌమాన్ అనే ఈ పిల్లవాడు అందరికంటే గొప్ప ఆలిమ్‌గా ఎంచబడతాడు" అని అనుకునేవారు.

## ఉపాధ్యాయునిగా

తాను విద్యార్థిగా ఉన్నప్పుడు ఓసారి ఏమయిందంటే, తన ఉపాధ్యాయులయిన హమ్మాద్ (రహ్మలై) ఏదో పని మీద బస్రా పట్టణానికి వెళ్తూ తన

బాధ్యతను అబూ హనీఫా (రహ్మలై)కి అప్పగించి వెళ్ళారు. ఇక ఇమామ్ సాహెబ్ తన గురువు హమ్మాద్ స్థానంలో నిల్చుని బోధించడం మొదలెట్టారు. జనం అడిగిన ప్రశ్నలతోపాటు తనిచ్చిన జవాబులు కూడా వ్రాసుకునేవారు. ఇలా రెండు నెలలు గడిచాక హమ్మాద్ (రహ్మలై) తిరిగివచ్చారు. ఈలోగా అబూ హనీఫా (రహ్మలై) ప్రజలు అడిగిన అరవై సందేహాలకు సమాధానా లిచ్చారు. ఈ అరవై సందేహాలు, సమాధానాలు ఒక పుస్తకంలో వ్రాసుకుని వాటిని తన గురువుగారు వచ్చిన పిదప చూపించారు అబూ హనీఫా. హజ్రత్ హమ్మాద్ (రహ్మలై) వాటిని సమీక్షించి వాటిలో ఫలానా ఫలానా సమాధానం సరి అయినది కాదని చెప్పి వాటిని సరిదిద్దారు. తతిమ్మా సమాధానాల పట్ల ఎంతో సంతోషం వెలిబుచ్చుతూ 'శెబాష్' అని మెచ్చుకున్నారు. ఈ విషయం కూఫాలో మారుమ్రోగి జనం వీరి విద్యా విజ్ఞానాలపై భరోసా చేయడం మొదలెట్టారు. తరువాత కొంత కాలానికి వీరి గురువు హమ్మాద్ (రహ్మలై) మరణించారు. అప్పుడు జనం వీరిని గురువు స్థానంలో నియమించారు. ఇక ఇమామ్ సాహెబ్ కూఫాలోనే అతి పెద్ద పాఠశాలలో అత్యంత ఉన్నత గౌరవ స్థానాన్ని అలంకరించారు.

ఇమామ్ సాహెబ్ బోధనా పద్ధతి ఎంతో మెరుగ్గా ఉండేది. ముందు, తాను చెప్పదలచుకున్న విషయాల్ని తన శిష్యుల ముందుంచి, వారి సలహాలను, అవగాహనా శక్తిని రాబట్టడానికి వారికి కొంత వ్యవధినిచ్చేవారు. తరువాత శిష్యులు వారి వారి శక్తి సామర్థ్యాల మేరకు ఇచ్చే జవాబుల్ని ఎంతో శ్రద్ధగా ఆలకించేవారు. ఒక శిష్యుడు సమాధానం చెబుతుంటే దాన్ని విని అది తప్పో, ఒప్పో గమనించమని మిగిలిన శిష్యులతో అనేవారు. చివర్లో తన నిర్ణయాన్ని వినిపించేవారు. ఈ విధంగా బోధించడం మూలానే శిష్యుల్లో ఆలోచన, అవగాహనా శక్తి పెంపొంది వారిలో గొప్ప గొప్ప ఆలిమ్‌లు, ఇమామ్‌లు తయారయ్యారు. వారిని ప్రపంచంలోని ఆలిమ్‌లే తమ నాయకులుగా ఎంచే వారు. ఇమామ్ గారి శిష్యుల్లో చాలా మంది ప్రఖ్యాతి గాంచారు. అయితే అందరిలోకెల్లా ఇద్దరు ముఖ్యంగా పేర్కొనదగినవారు. ఒకరు ఇమామ్ అబూ

యూసుఫ్, రెండవవారు ఇమామ్ ముహమ్మద్. (వీరిపై దైవ కారుణ్యం వర్షించుగాక).

## విద్య పట్ల అభిరుచి

హజ్రత్ అబూ హనీఫా (రహ్మలై) ఇంతటి గొప్ప ఆలిమ్ అయినప్పటికీ జ్ఞానాన్ని ఇంకా వృద్ధి చేసుకోవాలనే తలంపుతో పవిత్ర మక్కాకు పయన మయ్యారు. మక్కాలో హదీసు విద్య బోధించే అనేక పాఠశాలలుండేవి. వాటన్నిటిలోకెల్లా ఇమామ్ గారికి హజ్రత్ అతా (రహ్మలై) గారి పాఠశాల ఎంత గానో నచ్చింది. హజ్రత్ అతా రెండు వందల మంది సహాబీల (రజి) వద్ద హదీసులు సేకరించారు. అందుకే ఇమామ్ సాహెబ్ వారి పాఠశాలకు వెళ్ళారు. మక్కాలో హజ్రత్ ఇక్రమా (రహ్మలై) కూడా హజ్రత్ అతాతో సరితూగే గొప్ప ఆలిమ్. ఇమామ్ అబూ హనీఫా (రహ్మలై) వీరిరువురి వద్ద హదీసు విద్యను నేర్చుకుని మక్కా నుండి మదీనా వచ్చారు. మదీనాలో ప్రవక్త (స) వంశానికి చెందిన ఇద్దరు మహనీయులుండేవారు. వీరిరువురూ బహుముఖ జ్ఞాన సంపన్నులు. వీరిలో ఒకరు హజ్రత్ ఇమామ్ బాఖర్ (రహ్మలై), రెండవవారు ఇమామ్ జాఫర్ సాదిఖ్ (రహ్మలై). హజ్రత్ అబూ హనీఫా (రహ్మలై) మదీనాకు వచ్చిన పిదప వీరిరువురితో ఎంతో ఆప్యాయత ఏర్పడింది. వీరు మొదట ఇమామ్ బాఖర్ (రహ్మలై)ని కలిశారు. అంతకు ముందే ఇమామ్ బాఖర్ వీరి పేరు విని ఉన్నారు. వీరు అబూ హనీఫాని ఒకటి రెండు ప్రశ్నలడిగారు. ఆ ప్రశ్నలకు అబూ హనీఫా (రహ్మలై) ఇచ్చిన సమాధానం విని ఇమామ్ బాఖర్ (రహ్మలై) ఎంతో సంతోషించి, వారి నుదుటిని చుంబించి దుఆ చేశారు. "దైవ ధర్మానికి సంబంధించిన విషయాలన్నీ అహ్లె బైత్ (ప్రవక్త కుటుంబ సభ్యుల) ఇంటి నుండే వెలువడ్డాయి కనుక వారే ధార్మిక విద్యలో అందరికన్నా గొప్ప పండితులు" అని అబూ హనీఫా (రహ్మలై) అనేవారు. ఈ కారణంగానే ఇమామ్ సాహెబ్ మక్కా, మదీనాల్లో విద్యనభ్యసించి కూఫాకు తిరిగివెళ్ళినా వారి మనస్సు మాత్రం ఇక్కడే లగ్నమై ఉండేది. అందుకే ఇమామ్ సాహెబ్ అప్పుడప్పుడు

మక్కా, మదీనాలకు వెళ్ళి అక్కడి ఇమామ్‌లతో అహ్‌లెబైత్‌కు చెందిన మహనీయులు ఇంకా ఎవరున్నారని ఆరా తీసేవారు.

కూఫా నుంచి బస్రా, బస్రా నుండి మక్కా, మక్కా నుంచి మదీనా వెళ్ళి కేవలం అబూ హనీఫా (రహ్మాలై) అక్కడి పెద్దల ద్వారా హదీసు విద్యనే అభ్యసించలేదు, కాబట్టే ఆ పెద్దలు వీరి అవగాహనా శక్తిని, శ్రద్ధాసక్తుల్ని, కృషిని ఎంతగానో కొనియాడుతూ వీరిని గొప్ప ఆలిమ్‌గా పరిగణించారు. ఇమామ్ షాఫి (రహ్మాలై) అయితే వీరినుద్దేశించి, "అబూ హనీఫా (రహ్మాలై) సంచార జ్ఞాన నిధి" అని అనేవారు. ఇంతటి గొప్పవారయినా అబూ హనీఫా (రహ్మాలై) తన తొలి గురువు హజ్రత్ హమ్మాద్(రహ్మాలై)ని మొదటిలానే ఎంతో ఆదరించేవారు. వారు జీవించి ఉన్నంత కాలం వారి పాఠశాలలోనే ఉంటూ, వారికి శుశ్రూష చేస్తూ వారి పర్యవేక్షణలోనే ఇతరులకు జ్ఞానబోధ చేసేవారు. ఇమామ్ అబూ హనీఫా (రహ్మాలై) ఎంతటి యోగ్యులైన ఉత్తమ శిష్యులో చూడండి! ఇలాంటి శ్రమ, శ్రద్ధ, వివేచనాశక్తులు ఇంకా గురువుల యెడల గౌరవభావం కలిగిన విద్యార్థులే మున్ముందు గొప్పవారుగా రాణించగలరు. ఎవరయితే కష్టపడి చదవరో, గురువుల పట్ల గౌరవభావం చూపరో, శ్రద్ధతో చదవక, దైవం ప్రసాదించిన వివేచనా శక్తిని సరియైన రీతిలో ఉపయోగించరో అటువంటి విద్యార్థులపై దైవం తన శుభాల్ని కురిపించడు. ఈ విద్యార్థులే ఏ విజ్ఞానాన్నీ పొందలేక చివరికి మందబుద్ధులుగా మిగులుతారు. మంచి విద్యార్థులుగా మనగలగాలంటే హజ్రత్ ఇమామ్ అబూ హనీఫా (రహ్మాలై) గారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి.

హిజ్రీ 120వ శకంలో ఇమామ్ అబూ హనీఫా గురువుగారయిన హజ్రత్ హమ్మాద్ (రహ్మాలై) పరమపదించగా కూఫాలోని ప్రజలు, ఇంకా విద్యార్థులు ఏకమై వీరిని గురువుగారి స్థానంలో కూర్చోబెట్టారు. ఆ పాఠశాలలో వీరు ఎంతో శ్రమపడి ముప్ఫై సంవత్సరాలపాటు విద్యాబోధన చేశారు. ఆ కాలంలో సుదూర ప్రాంతాల వరకు వీరి పేరు మారుమ్రోగింది. నలుమూలల నుండి ఎంతోమంది శిష్యులు వచ్చి చేరగా వారి సంఖ్య వేలకు చేరింది. ఆ పాఠశాల నుండే అబూ

హనీఫా శిష్యుల్లో దాదాపు ఎనిమిది వందల మంది ఎన్నదగిన విద్యార్థులు తయారయ్యారు. అందులో యాభై మంది అబ్బాసీ ప్రభుత్వంలో న్యాయ మూర్తులుగా వ్యవహరించారు. కేవలం ఒక శిష్యుడు (అబూ యూసుఫ్) ఎంతటి గొప్ప న్యాయమూర్తిగా, ఆలిమ్‌గా వినుతికెక్కారంటే, ఆ రోజుల్లో అందరికంటే గొప్ప రాజయిన హారూన్ రషీద్ వీరిని ఎంతో గౌరవించేవాడు. ఆయన వీరిని తన రాజ్యానికి ప్రధాన న్యాయమూర్తిగా నియమించాడు.

## మాతృసేవ

ఇమామ్ అబూ హనీఫా (రహ్మాలై) కాలంలో వారిని మించిన పండితుడు (ఆలిమ్) ఎవరూ లేకుండిరి. దీనికితోడు దైవం వారి సంపదలో శుభాన్నీ, వృద్ధినీ ప్రసాదించాడు. వారికి బట్టల మిల్లుతోపాటు ఒక దుకాణం కూడా ఉండేది. వారు ఇతరుల ముందు ఎప్పుడూ చేయిచాచేవారు కాదు. అంతవున్నా ఎంతో నిరాడంబరంగా ఉండేవారు. ఎప్పుడూ తన దర్పాన్ని చాటుకునేవారు కాదు. తన వద్దకు వచ్చిన చిన్నా పెద్దా అందరినీ ఆదరించేవారు. వారు ఇమామ్ అయిన తరువాత చాలా కాలం వరకూ వారి తల్లి జీవించే ఉన్నారు. తన తల్లి కొరకు ఎంతో మంది సేవకురాండ్రు ఉన్నప్పటికీ ఇమామ్ సాహెబ్ స్వయంగా వెళ్ళి అన్ని విధాలా ఆమెకు సేవ చేసేవారు. బజారుకెళ్ళి సరకులు తీసుకొచ్చి, తల్లి ముందు ఎంతో అణకువతో సాధారణ మనిషిలా నిల్చుని, "అమ్మా! నీ తనయుడు నౌమాన్ నీ సేవలో హాజరయ్యాడు" అని అనేవారు. తల్లి వెళ్ళమని చెప్పేంత వరకు ఆమె సేవ నుండి కదిలేవారు కాదు. ఏనాడూ తల్లి మాట జవదాటి ఎరుగరు. ఈ విషయంలో వారి గురించే ఆసక్తికరమయిన గాథ ఒకటి మనకు చరిత్ర పుస్తకాల్లో దొరుకుతుంది.

కూఫాలో అనేకమంది ఆలిమ్‌లుండేవారు. వారిలో అమ్ర్ బిన్ వర్‌ఖా (రహ్మాలై) ఒకరు. వీరిని తన తల్లి ఎంతో ఆదరించేవారు. ఎప్పుడయినా ఏదైనా సమస్య ఎదురైనప్పుడు ఇమామ్ సాహెబ్‌తో తన తల్లి, "ఓ నౌమాన్, అమ్ర్ బిన్ వర్‌ఖా గారి వద్దకు వెళ్ళి దీనికి సమాధానం తెలుసుకునిరా" అని

అనేవారు. ఆ విధంగానే ఇమామ్ గారు ఎంతో హుషారుగా వెళ్ళి దానికి సమాధానం తెలుసుకుని వచ్చేవారు. ఇమామ్ సాహెబ్‌ని చూసి అమ్ర్ బిన్ వర్‌ఖా ఎంతో సిగ్గుపడి, "మీ అంతటివారుండగా నేనా దీనికి సమాధాన మిచ్చేది?" అని అనేవారు. దీనికి సమాధానంగా ఇమామ్ సాహెబ్, "ఇది నా తల్లి ఆజ్ఞ. దీనికి సమాధానం మీరు చెబితేనే బాగుంటుంద"ని అనేవారు. అప్పుడప్పుడు కొన్ని ప్రశ్నలకు సమాధానాలేమివ్వాలో తెలియక ఇబ్నె వర్‌ఖా (రహ్మాలై) ఇమామ్ సాహెబ్‌ను అడిగి వాటినే వారి తల్లి వద్దకు పంపేవారు. దీన్నిబట్టి అబూ హనీఫా ఎంత గొప్పవారో అర్థం చేసుకోవచ్చు. అయినప్పటికీ తానెంతో జ్ఞానినని వారు ఎప్పుడూ గర్వించలేదు. ఇక మీరే చెప్పండి- గర్వంతో విర్రవీగిన సంఘటన ఒక్కటయినా వారి జీవితంలో ఉందేమో. ఇదే కాదు, దీన్ని మించిన మరో ఆసక్తికరమయిన విషయం చదవండి. ఒకసారి వారి తల్లి, వారిని ఓ సమస్య అడిగారు. దానికి తనయుని సమాధానం విని ఆమె, "నీ సమాధానం ఏమీ అర్థం కావడం లేదు, పద, ఇబ్నె వర్‌ఖా దగ్గరికెళదాం" అని అన్నారు. అలాగే ఇద్దరూ కలిసి ఇబ్నె వర్‌ఖా దగ్గరికెళ్ళారు. వారు కూడా అదే సమాధానాన్నిచ్చారు. అప్పుడు గాని వారి తల్లి తృప్తిచెందారు కాదు. అయితే దీనిపై అబూ హనీఫా, "ఇదే సమాధానం నేనెప్పుడో చెప్పాను కదా" అన్న ఒక్క మాట కూడా అనలేదు. దీన్నిబట్టి మనకు అర్థమయ్యేదేమంటే ఇమామ్ గారు తన తల్లికి వ్యతిరేకంగా కనీసం "ఉఫ్" అని కూడా అనేవారు కాదని తెలుస్తోంది. ఈ విషయమే ఖుర్‌ఆన్‌లో ఇలా పేర్కొనబడింది: "మీ తల్లిదండ్రుల పట్ల 'ఉఫ్' అని కూడా అనకండి." దీంతో ఇమామ్ గారిలో ఏ మాత్రం గర్వంలేదని తేలిపోయింది.

## దాతృగుణం

దైవం ఇమామ్‌గారికి విద్యతోపాటు విత్తం కూడా ప్రసాదించాడు. దైవ ప్రసాదితాలయిన ఈ విద్యా సంపదల్ని ఇమామ్ సాహెబ్ దైవదాసుల కొరకే ఖర్చు చేశారు. వారి పాఠశాలలో ఎన్నో వేల మంది విద్యార్థులు చదువుకునే

వారు. వారి వద్ద ఎలాంటి ఫీజు, ప్రతిఫలం తీసుకోకుండానే ఇమామ్ సాహెబ్ వారందరికీ ఉచితంగానే ధార్మిక విద్యను బోధించేవారు. పేద విద్యార్థులకు ఇమామ్ సాహెబ్ ఎంతో సహాయం కూడా చేసేవారు. వారు చేసే సహాయంతో ఆ విద్యార్థుల ఇళ్ళు కూడా హాయిగా గడిచిపొయ్యేవి. వీరి శిష్యుల్లో అబూ యూసుఫ్ అందరికంటే తెలివిగల శిష్యులు. మున్ముందు వీరి కాలంలో వారికి సాటి అయిన ఆలిమ్, న్యాయమూర్తి ఎవరూ లేకపొయ్యారు. అబూ యూసుఫ్ విద్యనభ్యసించే సమయంలో ఎంతో నిరుపేద స్థితిలో ఉండేవారు. వీరి కుటుంబం ఇమామ్ సాహెబ్ ఇచ్చిన భత్యంతోనే సుఖంగా గడిచిపోయేది. ఈ విధంగా ఎంతో మంది పేద విద్యార్థులకు వీరు సహాయం చేసేవారు. దైవ ప్రసాదితమయిన ధన సంపదను దైవదాసులకు ఎంత ఎక్కువగా అందజేస్తే అంత ఎక్కువగా వారు ధార్మిక విద్యను అభ్యసిస్తారని ఇమామ్ గారు భావించేవారు. అదే వారి దాతృత్వంలోని ఆంతర్యం.

తన శిష్యులతో ఏ విధంగా నడుచుకునేవారో, ఇతర వ్యక్తులతో కూడా అలాగే నడుచుకునేవారు. వీరు ఎవరికైనా అప్పు రూపేణా డబ్బిస్తే దాన్ని అతను తిరిగి ఇవ్వని పక్షంలో అతన్ని క్షమించేవారు. తనను తరచూ కలిసే వారితో "సోదరా! ఏదన్నా అవసరముంటే చెప్పు" అంటూ, అడిగిన వారికి తగినంత సహాయం చేస్తూ, "ఇంత సంపదను ప్రసాదించిన దైవానికి కృతజ్ఞతలు. మీకివ్వడానికే దైవం తన కరుణానుగ్రహాలతో నాకీ సంపదనిచ్చాడు" అని అనేవారు. తిరిగిరాని అప్పును క్షమించేసేవారు. ఈ సందర్భంగా ఓ గమ్మత్తయిన సంఘటనను వినండి. ఒకసారి వీరు ఓ రోగిని పరామర్శించడానికి వెళ్తున్నారు. మార్గంలో ఓ మనిషి వీరిని చూసి ముఖం చాటు చేసుకుని అకస్మాత్తుగా దారి మళ్ళించి వెళ్తున్నాడు. అతన్ని చూసి ఇమామ్ సాహెబ్, "ఎందుకలా దారి మళ్ళించి వెళ్తున్నావు?" అని అన్నారు. అప్పుడా వ్యక్తి, "మీకు నేను పది వేల రూపాయల అప్పుపడ్డాను. ఇంతవరకు చిల్లిగవ్వ కూడా చెల్లించలేకపోయాను. మీరు కనిపిస్తే సిగ్గుగా ఉంది" అని అన్నాడు. ఇది విన్న ఇమామ్ సాహెబ్, "అలాగయితే నేను దాన్ని మాఫీ చేశాను, పో" అని అన్నారు.

ఇంకోసారి కూఫాలో ఓ ఆలిమ్‌గారు అప్పుల్లో చిక్కుకున్నారని, దాన్ని తీర్చలేక సిగ్గుతో ఇంట్లో నుండి బయటికి రావడమే మానివేశారని విని ఆ మొత్తం పైకాన్ని ఆ ఆలిమ్‌గారికి పంపారు.

మరోసారి ఇద్దరు వ్యక్తులు తగాదాపడటం చూసి, "మీరెందుకు ఇలా పోట్లాడుకుంటున్నార"ని అడిగారు. వారిలో ఒకతను, "ఇతను నా పైకం ఇవ్వడం లేదు" అని అన్నాడు. ఇది విని ఇమామ్ సాహెబ్ వెంటనే జేబు నుండి పైకం తీసి ఇస్తూ, "ముస్లిములు ఒకరికొకరు తగాదా ఆడుకోరాదు" అని హితబోధ చేశారు.

ఇలాంటి విషయాలు వీరి జీవితంలో కోకొల్లలుగా దొరుకుతాయి. మనం ఎన్నని వివరించగలం వాటిని? తరువాత, ఇమామ్ సాహెబ్ డబ్బు ఎలా సంపాదించేవారో రెండు సంఘటనల ద్వారా వినండి.

## వ్యాపారం

ఇమామ్ సాహెబ్‌కు బట్టలు తయారయ్యే ఓ మిల్లు, ఇంకా ఓ దుకాణం ఉందని మీరిదివరకే తెలుసుకున్నారు. వీరి మిల్లులో తయారయిన వస్త్రాలు సుదూర ప్రాంతాలకు సరఫరా చేయబడేవి. లక్షల కొలది డబ్బు వ్యాపారంలో ఉంది. అలాంటప్పుడు ఒక పైసా అయినా అధర్మంగా అందులో కలిసిపోతే ఏం తెలుస్తుంది? "అమ్మే సరుకులో లోపం ఉంటే కొనుగోలుదారులకు దాన్ని గురించి తెలియజేయాల"ని ఒక హదీసులో ఉంది. దీన్ననుసరించి ఇమామ్ సాహెబ్, "సరుకులో లోపం ఉంటే కొనుగోలుదారులకు తెలియజేయండ"ని తన మనుషులకు ఆజ్ఞాపించేవారు. ఒకసారి తన ఉద్యోగి అయిన ఇబ్నె అబ్దుర్రహ్మాన్ లోపమున్న ఓ వస్త్రాల తానును అమ్మి వచ్చారు. అందులో లోపం ఉన్న విషయం అతనికి తెలుసు, కాని అమ్మే సమయంలో దాన్ని గురించి కొనుగోలుదారులకు తెలియజేయడం మరచిపోయాడు. భయపడుతూ వచ్చి ఈ విషయాన్ని ఇమామ్ సాహెబ్‌కు తెలియజేశాడు. దీనిపై ఇమామ్ సాహెబ్ ఆ సరుకుకు సంబంధించిన పైకం మొత్తం 35 వేల రూపాయల్ని దానం చేసేశారు.

ఇంతకంటే ఎక్కువ గుణపాఠాన్ని గరిపే మరో వృత్తాంతముంది. ఒకసారి ఓ స్త్రీ పట్టు వస్త్రాన్ని అమ్మడానికి వీరి దుకాణానికి వచ్చింది. ఆ సమయంలో వీరు అక్కడే ఉన్నారు. ఆ స్త్రీతో, "ఈ తాను ఖరీదు ఎంత?" అని అడిగారు. సమాధానంగా ఆమె, "వంద రూపాయల"ని అన్నది. తానును పరీక్షించిన ఇమామ్ సాహెబ్ ఆమెతో, "నీవు చెప్పిన ధర చాలా తక్కువ" అని అన్నారు. ఇమామ్ సాహెబ్ వేళాకోళమయితే చేయడం లేదు కదా అని ఆమె వారి వంక చూసి, "తక్కువ ధర అనుకుంటే తగిన ధర ఇవ్వండి" అని అడిగింది. తరువాత ఇమామ్ సాహెబ్ ఆ తానును తీసుకుని ఆమెకు ఐదు వందల రూపాయలిచ్చారు. ఆమె ఎంతో సంతోషంతో వెళ్ళిపోయింది. ఇక మీరే చెప్పండి- ఇంతటి నిజాయితీపరుడైన వర్తకుణ్ణి మీరెక్కడయినా చూశారా?

## ఇరుగుపొరుగుతో

ఇంకో మంచి ఆసక్తికరమయిన విషయాన్ని చదవండి. వీరి పొరుగున ఓ పహిల్వానుండేవాడు. అతను మహా పోకిరి, మూఢుడు కూడా. దానికితోడు అతనికి పాటలు పాడటం, వాయిద్యాలు వాయించడం అంటే ఎంతో ఇష్టం. రాత్రివేళలో అతను తరచుగా పాటలు పాడుతూ, వాయిద్యాలు వాయిస్తూ నానా అల్లరి చేస్తుండేవాడు. ఆ కారణాన ఇమామ్ సాహెబ్‌కు సరిగా నిద్రపట్టేది కాదు. చుట్టుప్రక్కల ప్రజలు ఆ పహిల్వానుకు అలా చేయొద్దని ఎంత నచ్చజెప్పినా అతను భుజబల గర్వంతో ఇంకా విర్రవీగేవాడు. ఓసారి ఏదో ఓ తగాదాలో రక్షకభటులు అతన్ని బంధించి తీసుకెళ్ళి జైల్లో ఉంచారు. ఈ విషయం ఇమామ్ సాహెబ్‌కు తెలిసి, ఖాజీ (న్యాయమూర్తి)గారి దగ్గరకెళ్ళి ఆ పహిల్వాను తన పొరుగువాడని, అతనికి సహాయం చేయడం తన విద్యుక్త ధర్మమని అన్నారు. ఏదైనా జరిమానా చెల్లిస్తేనే అతన్ని విడిచిపెడతామని అంటే తాను ఆ జరిమానా చెల్లించడానికి కూడా సిద్ధంగా ఉన్నానని ఖాజీగారితో అన్నారు ఇమామ్ సాహెబ్.

సమాధానంగా ఖాజీగారు, "రోజూ మీ నిద్రను భంగం చేసే ఇలాంటి దుష్టుణ్ణా మీరు విడిపిస్తాననటుంది?" అని అన్నారు. "అవును, నేనితణ్ణి

విడిపించడానికే వచ్చాను. ఎందుకంటే, ప్రవక్త మహనీయులు (స) పొరుగువారి పట్ల మంచిగా మెలగాలని సెలవిచ్చారు" అని అన్నారు ఇమామ్ సాహెబ్.

అప్పుడు ఖాజీగారు ఆ పహిల్వాన్ను విడుదల చేశారు. తన పట్ల ఇమామ్ సాహెబ్ కనబరచిన కారుణ్యపు తీరుతో అతని ప్రవర్తనలో ఎంతో మార్పు వచ్చింది. పాటలు, వాయిద్యాలు అన్నీ మానేసి అతను ఇమామ్ సాహెబ్ శిష్యుడిగా చేరాడు. ధార్మిక విద్య నేర్చి అతను చివరికి గొప్ప ఆలిమ్గా మారిపొయ్యాడు.

## హనఫీ ఫిఖా రూపకల్పన

ఓనాటి సంఘటన. కూఫాలో ఓ ఖాజీగారు తన కచ్చేరి (న్యాయస్థానం) ముగించుకుని ఇంటికి వస్తున్నారు. ఆయన దారిలో ఓ స్త్రీని చూశారు. ఆమె ఎవరితోనో తగాదాడుతూ బాగా చీవాట్లు పెడుతోంది. ఇది విన్న ఖాజీగారు బంట్రోతులతో, "ఈమెను పట్టి న్యాయస్థానంలో హాజరు పరచండ"ని ఆజ్ఞాపించారు. తను కూడా మళ్ళీ న్యాయస్థానానికి తిరిగొచ్చారు. న్యాయస్థానంలో కేసును పరిశీలించి, ఆమెకు కొరడా దెబ్బల శిక్ష విధించారు.

ఈ విషయం విన్న ఇమామ్ అబూ హనీఫా, "ఖాజీగారు ఇలా చేసి తప్పు చేశారు. ఆయన తనంతట తాను ఇలా వ్యాజ్యాన్ని కోర్టుకు తెచ్చి తీర్పునియ్యడం అభిలషణీయం కాదు. ఎవరయినా వ్యక్తి కోర్టుకు ఏదయినా ఫిర్యాదు తెస్తే దానిపై ఖాజీ తీర్పునివ్వడం సహేతుకం, సమంజసమూను" అని అన్నారు.

ఈ విధంగా ఇమామ్ గారు ఖాజీలకు సంబంధించిన ఎన్నో తప్పుల్ని పట్టేశారు. అప్పటి వరకు ఖుర్ఆన్, హదీసుల ప్రకారం తీర్పునిచ్చేందుకు, ఎలాంటి న్యాయశాస్త్ర గ్రంథాలు వ్రాయబడలేదు. అందుకే కొన్ని కేసుల్లో ఖాజీలు ఎటూ నిర్ణయించలేక సందిగ్ధంలో పడిపోతుండేవారు. ఈ సందిగ్ధ పరిస్థితి వల్ల తప్పుడు తీర్పులు ఇచ్చేవారు. దీనిపై అప్పుడు ఇమామ్గారు,

"ఖాజీలు సులువుగా తీర్పులిచ్చేందుకు ఓ ప్రామాణిక గ్రంథం ఉంటే బావుండున"ని తలపోశారు. తన ఈ అభిప్రాయాన్ని తన శిష్యుల ముందుంచారు. తన శిష్యుల్లో ఖుర్ఆన్, హదీసుల్లో అపార జ్ఞానాన్ని ఆర్జించిన గొప్ప గొప్ప పండితులున్నారు. వారంతా ఇమామ్‌గారి అభిప్రాయంతో ఏకీభవించారు. ఇమామ్ సాహెబ్ దీనికొరకు తన శిష్యుల్లో నుంచి కొంత మందిని ఎన్నుకున్నారు. అంతా వీరి వద్ద సమావేశమై సమస్యలపై దృష్టి సారించి, ఖుర్ఆన్‌ని, ప్రవక్త (స) సంప్రదాయాన్ని దృష్టిలో ఉంచుకుని తమ తమ సలహాలను, అభిప్రాయాలను వ్యక్తం చేసేవారు. అన్నిటిని శ్రద్ధతో విని ఇమామ్ సాహెబ్ చివరన తన అభిప్రాయాన్ని వెలిబుచ్చేవారు. ఈ విధంగా వారు ఫలానా విషయంలో ఇలా తీర్పు జరగాలని, ఇది ధర్మసమ్మతమయిందని, లేక కాదని, ఇది విధి అయినదని, లేక విధి కాదని, లేక ఇది ప్రవక్త (స) సంప్రదాయమని విడమరచి చెబుతూ తీర్పులు వ్రాయించేవారు.

ఇంతకు ముందు జరుగుతూ వస్తూన్న మరో కార్యమేంటంటే దూర ప్రాంతాల నుండి ఎంతో మంది ప్రజలు ఇమామ్ సాహెబ్ వద్దకు ఫత్వా (తీర్పు)ల కొరకు వచ్చేవారు. ఫలానా విషయం ఖుర్ఆన్, సున్నత్ (ప్రవక్త సంప్రదాయం) ప్రకారం సరి అయిందా లేదా, అంగీకారయోగ్యమా కాదా? దీన్ని నెరవేర్చాల్నా? వద్దా? అని అడిగేవారు. ఇలాంటి విషయాల్ని ఖుర్ఆన్, సున్నత్‌ల వెలుగులో తీర్పునివ్వడాన్నే ఫత్వా అని అంటారు. ఈ విధంగా ఇమామ్ సాహెబ్ ఎన్నో సందేహాలను నివృత్తి చేశారు. ఇవన్నీ తన వద్ద ఓ రిజిష్టర్‌లో నమోదు చేసుకునేవారు. ఆ రిజిష్టరులో ఉన్న సందేహాలన్నిటికి జవాబులు వరుసగా ఒక చోట వ్రాయించారు. ఈ విధంగా విశ్వాసం (ఈమాన్), హజ్, జకాత్, వివాహం, ఇచ్చిపుచ్చుకోవడాలు, వ్యాపార లావాదేవీలు, తగాదాలు, వివాదాలు, సంపాదించడం, ఖర్చుపెట్టడం, పరిపాలనా వ్యవహారాలు - ఒకటేమిటి, మానవ జీవితంలో ఎదురయ్యే అన్ని సమస్యలను ఖుర్ఆన్, హదీసుల ప్రకారం పరిశీలించి, ఫలానా విషయం ఇలా చెయ్యవచ్చు; ఫలానా పని అలా చెయ్యకూడదు అని నిర్ధారించి మరీ వ్రాశారు. ఈ విధంగా సమస్యలు, వాటికి సంబంధించిన సమాధానాలకు సంబంధించి వేర్వేరు గ్రంథాలు తయారయ్యాయి.

ఈ సందేహాలు, ఫత్వాలు కొద్ది కాలంలోనే నలువైపులా వ్యాపించి ప్రసిద్ధిచెందాయి. ప్రజలకు వీటి అవసరముంది కనుక వెంటనే ఈ గ్రంథాలు పెద్ద ఎత్తున అమ్ముడుపోయాయి. ఖాజీలు కూడా వీటి ప్రకారమే తీర్పులివ్వడం మొదలెట్టారు. చూస్తుండగానే ఇమామ్ సాహెబ్ తయారుచేసిన ఫిఖా ఇస్లామీయ రాజ్యంలో వ్యాపించిపోయింది. వీరు, వీరి శిష్యులు కలిసి చేసిన ఈ బృహత్తర కార్యం మూలంగానే ముస్లిమ్‌లకు తమ సందేహాల నివృత్తి ఎంతో తేలికయిపోయింది. దీనిపై ముస్లిమ్‌లు దైవానికి కృతజ్ఞతలు తెలియ జేస్తూ, దీన్ని రూపొందించిన ఇమామ్ సాహెబ్‌పై, వారి శిష్యులపై దైవం తన కారుణ్యానుగ్రహాల్ని కురిపించాలని నేటికీ ప్రార్థిస్తున్నారు. ఇలాంటి గొప్ప కార్యాన్ని నెరవేర్చి వెళ్ళారు కాబట్టే ఇమామ్ సాహెబ్ "ఇమామె అజమ్ (నాయకాగ్రేసరుడు)"గా వినుతికెక్కారు.

## అధికారులు, రాజుల పట్ల ప్రవర్తన

వెనుకటి పుటల్లో మీరు హజ్రత్ అబూ హనీఫా (రహ్మలై) ఇస్లామీయ ఫిఖాకు ఆద్యులని తెలుసుకున్నారు. ఆయన దేవుని, దైవ ప్రవక్త (స) ఆదేశాల ప్రకారం నడుచుకునే వారు. వీరిని గురించే మీకు మరో విషయం తెలుపవలసి ఉంది. దీని ద్వారా గాని మీకు తెలిసిరాదు-ఇమామ్ సాహెబ్ దేవుని, దైవ ప్రవక్త (స) ఆజ్ఞల ముందు మరెవరి ఆజ్ఞనయినా, అంటే ఎంతటి గొప్ప అధికారి అయినా, రాజయినా వారి ఆజ్ఞల్ని పాలించేవారు కాదు. వీరి కాలంలోని పాలకులయినా, రాజులయినా డబ్బు ఆశ చూపిగాని, భయపెట్టిగాని, వత్తిడి తెచ్చిగాని తమ అభీష్టానుసారం ఆయన పలికేట్లు చెయ్యలేకపోయారు. అసలేంటంటే ఇమామ్ సాహెబ్ తన కాలం నాటి పాలకులను, రాజులను సత్య పరిపాలకులుగా భావించేవారు కాదు. ఒక్క దేవుణ్ణి మాత్రమే తన నిజమయిన పాలకుడుగా, రాజుగా, మనిషి ఆ దేవుని దాసుడిగా, ప్రతినిధిగా తలచేవారు ఇమామ్ సాహెబ్. ఈ ప్రతినిధి లేక నాయబ్ అయిన మనిషి దైవం తరఫున ఎలాంటి ఆదేశాలు అందినా వాటి ప్రకారం స్వయంగా

నడుచుకుంటూ, ఇతరుల్ని కూడా వాటిపై నడుచుకునేలా చేయాలి. ఇతరులు దైవాదేశాలపై నడుచుకునేలా చేయడానికి దైవదాసులు తమలో ఎవరయితే అధిక దైవభీతి పరాయణుడో అతణ్ణి తమ నాయకునిగా ఎంచుకుని, అతనికే తమ సమస్త బాధ్యతల్ని అప్పజెబుతారు. ఇస్లామ్‌లో ఇటువంటి వ్యక్తినే నిజమైన ఖలీఫాగా పరిగణిస్తారు. అందుకనే ఇమామ్ సాహెబ్ కూడా అలాంటి లక్షణాలు గల వ్యక్తినే నిజమయిన ఖలీఫాగా ఎంచేవారు. ఇమామ్ సాహెబ్ కాలంలో అంగబలంతో, అర్థబలంతో ఓ వ్యక్తి ఖలీఫా అయ్యేవాడు. ఇటువంటి ఖలీఫా తనకు ఇష్టమయిన వ్యక్తుల్నే గవర్నర్లుగా, కలెక్టర్లుగా నియమిస్తూ ఇష్టారాజ్యం చెలాయించేవాడు. వీరికి దైవం పట్ల, దైవప్రవక్త (స) పట్ల భయభక్తులు, వారి ఆదేశాల ప్రకారం నడుచుకునే శ్రద్ధాసక్తులు చాలా తక్కువగా ఉండేవి. వీరిలో అధికార కాంక్ష మాత్రమే ఎక్కువగా ఉండేది. ఈ విధంగా తమ రాజ్యాన్ని పటిష్టం చేసుకోవాలని తలచేవారు వీరు. వీరి అభీష్టానికి ఎవరయినా ఎదురు తిరిగాడో, ఇంకేముంది అతను కఠినమయిన శిక్షకు గురయ్యేవాడు.

ఈ రాజులు తమ ప్రభుత్వంలోని పెద్దవాళ్ళందరికీ ఏదైనా లాలూచీ చూపించి తమ వైపునకు తిప్పుకుని తాపీగా పరిపాలన చేస్తుండేవారు. ఇక సామాన్య ప్రజల్లో వీళ్ళకు అడ్డు చెప్పే వాడెవడుంటాడని? జనసామాన్యం సాధారణంగా తమ పెద్దవారు ఏం చేస్తే దాన్నే చేస్తూపోతారు.

సామాన్య ప్రజలపై ధర్మవేత్తల, పండితుల ప్రభావం అధికంగా ఉంటుంది. అందువలననే ఈ రాజులు, పండితుల్ని నయాన భయాన పెద్ద ఆశలు చూపించి తమ వైపునకు త్రిప్పుకుంటూ ఉంటారు. బలహీనుడయిన పండితుడు భయపడో లేదా ప్రలోభానికి గురి అయ్యో రాజుగారికి వంత పలుకుతాడు. ఒకవేళ ఎవరయినా ఆలిమ్ తమ మాటకు వ్యతిరేకత చూపిస్తే, అతన్ని అంతమన్నా చేయిస్తారు లేదా చెరసాలలోనైనా బంధింపజేస్తారు.

ఇలాంటి ప్రభుత్వాధికారులకు, పాలకులకు హజ్రత్ ఇమామ్ అబూ హనీఫా (రహ్మలై) ఎదురొడ్డి నిలవవలసిన పరిస్థితి ఎదురయింది. మొదట

ఇరాఖ్ గవర్నరయిన ఇబ్నె హుబైరా వీరిని తన మద్దతుదారునిగా మలచుకో జూశాడు. ఇరాఖ్ ప్రజలు ఇబ్నె హుబైరాకు వ్యతిరేకులైపొయ్యారు. అలిమ్‌లు తన మద్దతుదారులుగా మారి తన మాటకు వంతపాడినట్లయితే సామాన్య ప్రజ తనకు వ్యతిరేకంగా నడుచుకోరని అతను తలపోశాడు. ఈ విధంగా ఆలోచించే అతను పెద్ద పెద్ద ఆలిమ్‌లను పిలిపించి ఉన్నత పదవులిచ్చి, తన మద్దతుదార్లుగా మలచుకున్నాడు. తరువాత ఇతను హజ్రత్ అబూ హనీఫా (రహ్మలై)ని కూడా పిలిపించి, "నేను మీ చేతికి నా రాచముద్రను ఇస్తున్నాను. మీరు ఏ ఆజ్ఞ ఇస్తే అదే సాగుతుంది. ఒకవేళ మీ ఇష్టానికి వ్యతిరేకంగా నేనేదయినా ఆజ్ఞ ఇస్తే దానిపై మీ అంగీకార ముద్రను వేయనవసరం లేదు. ఈ విధంగా ధనాగారం నుండి నా ఉత్తర్వు మీద మీరు ముద్రవేసిన డబ్బు మాత్రమే బయటికి వస్తుంది. మీరు నా దర్బారులో ఉండండి" అని అన్నాడు.

ఇమామ్ సాహెబ్ అతని దర్బారులో ఉండటానికి, ఈ బాధ్యతలు స్వీకరించడానికి నిరాకరించారు. దీనిపై ఆ రాజు వీరిని ఖైదు చేయించి, కొరడా దెబ్బలు కొట్టిస్తానని బెదిరించాడు. అయినా ఇమామ్ సాహెబ్ అంగీక రించలేదు. అప్పుడు ఇబ్నె హుబైరా, "దీన్ని అంగీకరించకపోతే పోనివ్వండి. రాజధాని పట్టణానికి మిమ్మల్ని ఖాజీగా నియమించాలని అనుకుంటున్నాను. కనీసం దీన్నయినా అంగీకరించండ"ని అన్నాడు. దీన్ని కూడా ఇమామ్ సాహెబ్ నిరాకరించారు. దాంతో ఇబ్నె హుబైరాకు కోపం వచ్చింది. "కూఫా న్యాయమూర్తి పదవికైనా అంగీకరించనట్లయితే మిమ్మల్ని కొరడా దెబ్బలతో శిక్షిస్తాన"ని అతను బెదిరించాడు. "ప్రపంచంలో కొరడా దెబ్బల్నయినా సహిస్తాను గాని దేవుని అయిష్టతకు పాల్పడి పరలోకంలో శిక్షను అనుభవించడం నా వల్ల కాదు; దైవసాక్షి! నన్ను ఇబ్నె హుబైరా హత్య చేయిస్తానన్నా నేనయితే అతని మాటను అంగీకరించేది లేద"ని సమాధానమిచ్చారు ఇమామ్ సాహెబ్. తరువాత ఇబ్నె హుబైరా ఇమామ్‌గారి తలపై ముప్ఫై కొరడా దెబ్బలు కొట్టించి జైల్లో ఉంచుతూ తన మాట అంగీకరించేంత వరకు ప్రతి రోజూ పది కొరడా దెబ్బలు కొట్టాలని ఆజ్ఞాపించాడు. ఆజ్ఞ ప్రకారం ప్రతి రోజూ పది కొరడా

దెబ్బలు కొట్టడం జరుగుతోంది. ఆ దెబ్బలకు ఒంటిపై చర్మం ఊడిపోతున్నా ఇమామ్ సాహెబ్ తన మాట పైనే స్థిరంగా ఉన్నారు. ఈ విషయం ప్రజల్లో ప్రాకిపోయింది. ఇమామ్ సాహెబ్ జైల్లోనే మరణిస్తే క్షేమకరం కాదని దర్బారులో కొలువుదీరిన పెద్దలు ఇబ్నె హుబైరాతో అన్నారు.

ప్రజలు తన్ను ధిక్కరిస్తారేమోనన్న భయం ఇబ్నె హుబైరా మనసులో కూడా మెదలుతుండేది. అందుచేతనే కొంత మంది దర్బారులోని పెద్దల్ని పిలిచి, "మీలో ఎవరయినా వెళ్ళి కొంత గడువు పుచ్చుకునయినా నా మాటను అంగీకరించేందుకు ఇమామ్ సాహెబ్‌ను ఒప్పించండ"ని అన్నాడు. దీని ప్రకారం కొంత మంది జైలుకెళ్ళి ఇబ్నె హుబైరా మాటను ఇమామ్‌గారికి విన్పించారు. సమాధానంగా ఇమామ్ సాహెబ్, "నా నిర్ణయంపై మరో ఆలోచన ఏమీ లేద"ని అన్నారు. ఇక ఇబ్నె హుబైరా చేసేదిలేక ఇమామ్ సాహెబ్‌ను విడుదల చేశాడు. జైలు నుండి విడుదలై మక్కాకు వెళ్ళారు. ఇమామ్ సాహెబ్. తరువాత ఇరాఖ్‌లో ఇబ్నె హుబైరాకు వ్యతిరేకంగా ప్రజలు తిరుగుబాటు లేవదీశారు. అంతే ఇక ఇబ్నె హుబైరాకు అధికారమూ లేదు, రాచరికమూ లేదు.

## ఇమామ్ సాహెబ్, ఖలీఫా మన్సూర్

ఇమామ్ సాహెబ్ కాలంలో రాజులు సాగించిన దౌర్జన్యాన్ని కొంచెం గమనించండి. వారు ప్రపంచంలోని ఇతర రాజుల వలెనే ప్రవర్తిస్తూ ఖలీఫాలుగా పిలువబడేవారు. బలవంతంగా ఖలీఫాలుగా మారిన వీరు తమను వ్యతిరేకించేవారికి ధనాశ చూపించి తమకు అనుకూలురుగా మలచుకునేవారు. ఇలాంటి ఓ ఖలీఫాతో ఇమామ్‌కు పరిచయమేర్పడింది. అతని పేరు మన్సూర్. తనను తాను ఖలీఫాగా పరిగణించుకునేవాడు కాబట్టి ప్రజలు కూడా అతన్ని ఖలీఫాగానే పిలిచేవారు.

ఇమామ్ సాహెబ్ పేరుతోపాటు, వారి ఫిఖా యావత్ ప్రపంచంలో చెలామణి అవుతుందనీ, దీన్ననుసరించే ప్రజలు తమ ఇచ్చిపుచ్చుకోవడాలు, పెళ్ళి వ్యవహారాలు తదితర పనులన్నీ నెరవేర్చుకుంటున్నారనే విషయం ఖలీఫా

మన్సూర్ విన్నాడు. అందుచేత ఇమామ్ సాహెబ్‌ని సంతోషపెట్టాలని భావించి అతను వారి వద్దకు ఖరీదైన కానుకలు, నగదు పంపించాడు. అయితే ఇమామ్ సాహెబ్ వాటిని తిప్పి పంపించారు. ఖలీఫా ఇమామ్ సాహెబ్‌ను, "నా కానుకల్ని ఎందుకు స్వీకరించలేద"ని అడిగాడు. "మీరు మీ సొంత సొమ్ము నుండి ఈ కానుకల్ని పంపారా? వీటిని మీరు ప్రజా ధనాగారం నుండి తీసి పంపారు. ఈ సొమ్ముపై నాకెలాంటి అధికారం లేదు. నేను ఎలాంటి ధర్మపోరాటంలోనూ సిపాయిలా పాల్గొనలేదు. అలాంటి సిపాయీల పిల్లల జాబితాలో కూడా నేను లేను. పైగా నేను పేదవాణ్ణి కూడా కాను. ఇలాంటి సొమ్మును అనుభవించేందుకు" అని అన్నారు ఇమామ్ సాహెబ్ సమాధానంగా.

ఈ సమాధానం విని ఖలీఫా మనసు చిన్నబుచ్చుకున్నాడు. దీనిపై అతని దర్బారులో ఉన్నవారు, "అసలు ఇమామ్ సాహెబ్ మిమ్మల్ని ఖలీఫాగా ఎప్పుడు గుర్తించారని" అని అన్నారు. తరువాత ఖలీఫా ఇమామ్ సాహెబ్‌ని పిలిపించి, "నేను నిజమైన ఖలీఫాను కానా?" అని అడిగాడు. "నిజమైన ఖలీఫా అయితే అతను ముస్లిమ్‌ల చేత ఎన్నుకోబడి, దేవుని, దైవప్రవక్త (స) ఆదేశాల ప్రకారం ఇస్లామీయ ప్రభుత్వాన్ని నడపాలి" అని సమాధానమిచ్చారు ఇమామ్ సాహెబ్.

నిండు దర్బారులో ఖలీఫా మన్సూర్‌కు, ఇమామ్ సాహెబ్ ఇచ్చిన ఈ సమాధానం విని, "ఇంకేముంది, ఇమామ్ సాహెబ్ మెడపై కత్తి నాట్యమాడక తప్పదు" అని ప్రజలనుకున్నారు. అయితే ఖలీఫా మన్సూర్ అనుభవశాలి గనుక అలా చేయలేదు. ఇమామ్ సాహెబ్ మాటల్ని పట్టించుకోక వారిని పంపించాడు. వారు దర్బారు నుండి వెళ్ళిపోయాక మన్సూర్ తన మంత్రి అయిన రబీకు నాణాలు నిండిన ఓ సంచిని ఇచ్చి దాన్ని ఇమామ్ సాహెబ్‌కు ఇచ్చి రమ్మని ఆజ్ఞాపిస్తూ, "ఒకవేళ దాన్ని వారు తీసుకుంటే అక్కడే వారిని హతమార్చు, తీసుకోకుంటే మౌనంగా తిరిగొచ్చెయ్యి" అని చెప్పి పంపాడు. అలాగే రబీ ఆ సంచిని తీసుకుని ఇమామ్ సాహెబ్ వద్దకు వెళ్ళి దాన్ని వారి ముందుంచాడు. దాన్ని చూసి ఇమామ్ గారు వాపసు తీసికెళ్ళమని చెబుతూ, "ఈ పైకం మన్సూర్ కొరకే ధర్మసమ్మతం కానప్పుడు, నేనెలా స్వీకరించను.

నా శిరస్సు ఖండించినా దీన్ని నేను తీసుకోను" అని అన్నారు. చేసేదిలేక రబీ డబ్బు సంచితో తిరిగి వచ్చేశాడు.

మన్సూర్ తన ప్రభుత్వంలో ఇమామ్ ఏదో ఓ హోదాను స్వీకరించేలా చేయడానికి ప్రయత్నించాడు. మళ్ళీ అతను ఇమామ్ సాహెబ్‌ను రప్పించి, "నేను మిమ్మల్ని నా రాజ్యానికి ప్రధాన న్యాయమూర్తిగా నియమించదలిచాను. దయచేసి మీరు అంగీకరించండి" అని అన్నాడు. సమాధానంగా ఇమామ్ సాహెబ్ "నేను ఈ హోదాకు తగినవాణ్ణి కాను" అని అన్నారు. "మీరైతే అబద్ధ మాడుతున్నారు. మీరు అన్ని విధాలా దీనికి అర్హత కలిగిన వారు" అని మన్సూర్ అన్నాడు.

మన్సూర్ నోటి వెంట "అబద్ధీకుడు" అన్న పదాన్ని విన్న ఇమామ్ సాహెబ్, "మీ దృష్టిలో నేను అబద్ధీకుణ్ణయితే మరి నన్ను న్యాయమూర్తిగా నియమించడం చాలా పొరపాటు" అని అన్నారు.

వీరి సమాధానం విన్న మన్సూర్ మౌనంగా ఉండిపోయాడు. మళ్ళీ కొద్ది రోజుల తరువాత వీరినే ప్రధాన న్యాయమూర్తిగా నియమించదలచి సంప్రదించగా, "మీరు నియమించదలచిన ఖాజీ మీ ఆజ్ఞానుసారం తీర్పులు ఇచ్చేవాడే మీకు తగిన న్యాయమూర్తి. నేనయితే దైవానికి, దైవ ప్రవక్త (స)కు వ్యతిరేకంగా, మీకు అనుకూలంగా తీర్పు చెప్పలేను. మీరు నన్ను ఫర్హాత్ నదిలో పడవేయించినా సరే" అని ఇమామ్ సాహెబ్ అన్నారు.

తరువాత మన్సూర్ వీరికి ప్రాణ శత్రువైపోయాడు. అసలేం జరిగిందంటే, హజ్రత్ ఇమామ్ హుసైన్ (రజి) మనవడు హజ్రత్ జైద్ (రహ్మాలై) మన్సూర్‌కు పోటీగా తానే ఖలీఫానని ప్రకటించుకున్నారు. హజ్రత్ జైద్ (రహ్మాలై) ఎంతో సుగుణవంతులు, దైవభీతి పరాయణులు. వీరు ఖుర్‌ఆన్, హదీసుల జ్ఞాన సంపన్నులు. వీరిని ఖలీఫాగా ప్రకటించిన తరువాత మంచివారైన ముస్లిమ్ లంతా వీరి వైపు చేరిపోయారు. ఇమామ్‌ల నాయకులయిన హజ్రత్ అబూ హనీఫా (రహ్మాలై) కూడా హజ్రత్ జైద్ (రహ్మాలై) వైపు చేర్గారు. ఈ ప్రకటన విన్న మన్సూర్ ఎంతో కలవరపడి హజ్రత్ జైద్(రహ్మాలై)ను పట్టుకురమ్మని

తన సైన్యాన్ని పంపాడు. ఘోర పోరాటం జరిగింది. ఫలితంగా హజ్రత్ జైద్ (రహ్మలై) హత్య గావింపబడ్డారు. మన్సూర్ గెలుపొందాడు. తరువాత కొందరు, హజ్రత్ అబూ హనీఫా (రహ్మలై) కూడా జైద్(రహ్మలై) తరపువారేనని మన్సూర్‌తో అన్నారు. హజ్రత్ జైద్ (రహ్మలై) తరువాత వారి వంశం నుండే ముహమ్మద్ అబ్దుల్లాహ్, ఇబ్రాహీమ్ బిన్ అబ్దుల్లాహ్ అనే ఇద్దరు సద్గుణశీలురయిన వారు రంగంలోకి దిగారు. వీరు కూడా ఖలీఫాగా ప్రకటించుకున్నారు. వీరిరువురూ ఎంతో గొప్ప ఆలిమ్‌లు, జ్ఞాన సంపన్నులు, మంచివారూను. వీరికి హజ్రత్ అబూ హనీఫా ఎంతో మద్దతునిచ్చారు.

మన్సూర్ వద్ద హసన్ అనే పేరుగల గొప్ప సేనాపతి ఉండేవాడు. అతను ఇమామ్ సాహెబ్ వద్దకు అప్పుడప్పుడు వచ్చిపోతూ ఉండేవాడు. ముహమ్మద్ బిన్ అబ్దుల్లాహ్, వారి సోదరుడు ఇబ్రాహీమ్ బిన్ అబ్దుల్లాహ్‌పై పోరాటానికి మన్సూర్ ఇతన్నే పంపదలచుకున్నాడు. ఆ మేరకు హసన్‌ను ఆజ్ఞాపించాడు కూడా. హసన్ ఇమామ్ సాహెబ్ వద్దకు వచ్చి దీనిపై సలహా అడిగాడు. ఆ విధంగా చేయొద్దని ఇమామ్ సాహెబ్ అతనికి నచ్చజెప్పారు. దాని ప్రకారంగానే హసన్, మన్సూర్ వద్దకు వెళ్ళి తాను ఆ పోరాటానికి వెళ్ళనని చెప్పాడు.

ఆపై మన్సూర్ మౌనం వహించి రెండో సేనాపతిని పంపి, దర్బారులో ఉన్న పెద్దలతో, "అసలు హసన్ ఈ పోరాటానికి ఎందుకు వెళ్ళలేద"ని అడిగాడు. "అతను తరచూ ఇమామ్ అబూ హనీఫా వద్దకు వెళ్తుంటాడ"ని దర్బారీలు అన్నారు.

అప్పుడు మన్సూర్, "ఇమామ్ సాహెబే అతన్ని నిరోధించారన్న మాట" అని తెలుసుకున్నాడు. దాంతో అతను ఇమామ్ సాహెబ్‌పై పగబట్టాడు. మళ్ళీ అతను ఇమామ్ సాహెబ్‌ని పిలిపించి ఖాజీగా ఉండమని కోరాడు. వారు మళ్ళీ తన విముఖతను తెలియజేశారు. మొదట్నుంచే మన్సూర్ కోపంగా ఉన్నాడు కాబట్టి ఇమామ్‌ను కొరడా దెబ్బలు కొట్టమని ఆజ్ఞాపించాడు. ఆజ్ఞ ప్రకారం కొరడా దెబ్బలు పడటం ప్రారంభమయ్యాయి. వారి శరీరమంతా రక్తసిక్తమయిపోయింది. ఇమామ్ గారికి ముప్ఫయి కొరడా దెబ్బలు పడ్డాయి.

ఈ విషయాన్ని మన్సూర్ బాబాయి అబ్దుల్ సమద్‌కు ఎవరో చెప్పారు. వారు పరుగెత్తుకుంటూ వచ్చి, "నీవు ఏం చేస్తున్నావ్, వీరు ఇరాఖ్‌లోనే అందరికంటే గొప్ప ధర్మవేత్త. బాగా ఆలోచించు, నీవు నీ పైకి ఓ లక్ష కత్తుల్ని గురిపెట్టుకున్నావు" అని మన్సూర్‌ను చీవాట్లు పెట్టారు.

అబ్దుల్ సమద్ మాటల అర్థమేమంటే - ఒకవేళ ఇరాఖ్ ప్రజలు ఈ విషయాన్ని వింటే మన్సూర్‌పై కక్ష తీర్చుకోవడానికి తయారై వస్తారన్నది. దీన్ని గ్రహించి మన్సూర్ అదిరిపడ్డాడు. ఇమామ్ సాహెబ్‌ను సంతోషపెట్టడానికి మన్సూర్ ముప్ఫయి కొరడా దెబ్బల స్థానంలో ముప్ఫయి వేల రూపాయల పైకాన్ని పంపాడు స్వీకరించమని. ఇమామ్ సాహెబ్ దాన్ని తిరస్కరిస్తూ, "మన్సూర్ దగ్గర హలాల్ (ధర్మసమ్మతమయిన) సొమ్ము ఉంటే గదా నేను దీన్ని తీసుకోవడానికి" అని చెప్పి తిప్పి పంపారు.

తన బాబాయి అబ్దుల్ సమద్ చెప్పిన మీదట మన్సూర్ ఇమామ్ సాహెబ్‌ని విడిచిపెట్టి మళ్ళీ తన వద్దకు పిలిపించి ఖాజీగా ఉండమని కోరాడు. తిరిగి ఇమామ్ సాహెబ్ దాన్ని తిరస్కరించగా వారిని జైల్లో బంధించి కొంతకాలం తరువాత విషప్రయోగం చేయించాడు. దాని ప్రభావం వలన ఇమామ్ సాహెబ్ హిజ్రీ 150వ సంవత్సరంలో పరమపదించారు. మరణ సమయం ఆసన్నమయినప్పుడు ఇమామ్ సాహెబ్ ప్రజలతో ఇలా అన్నారు: "నేను చనిపోయిన తరువాత మన్సూర్ అధర్మంగా ప్రజల నుండి కాజేసిన స్థలంలో నా భౌతిక కాయాన్ని ఖననం చేయకండి."

ఇది ఆ కాలంలోని పాలకులతో, అధికారులతో ఇమామ్ సాహెబ్‌గారి ప్రవర్తన. చనిపోవడానికయినా సిద్ధమయ్యారు గాని దౌర్జన్యపరుడు, అత్యాచారియైనవాడిని ఖలీఫాగా అంగీకరించలేదు, అతని వద్ద నౌకరుగా ఉండటానికి అంగీకరించలేదు, అతను పంపిన కానుకల్నీ తీసుకోలేదు. దైవం ఇమామ్ సాహెబ్ సమాధిని కాంతితో నింపి, వారిపై తన కారుణ్యాన్ని కురిపించుగాక! దైవం మనకు ఇమామ్ సాహెబ్ బాటలో నడిచే సద్బుద్ధిని ప్రసాదించుగాక!

# ఇమామ్ మాలిక్ (రహ్మలై)

ఇమామ్ అబూ హనీఫా (రహ్మలై) లానే ఇమామ్ మాలిక్ (రహ్మలై) కూడా ఫిఖాలో గొప్ప ఇమామ్‌గా వినుతికెక్కారు. ఇమామ్ మాలిక్ మదీనా నివాసి. వీరు ప్రియప్రవక్త (స) అనుంగు అనుచరుడు హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ప్రియ సుతుడు. వీరు హిజ్రీ శకం 93లో జన్మించి, హిజ్రీ శకం 179 రబీఉల్ అవ్వల్ మాసం 11వ తారీఖు ఉదయం పరలోకానికేగారు. వీరి ఫిఖా గ్రంథం "ముఅత్తా" బహుళ ప్రచారం పొందింది. లక్షలాది ప్రపంచ ముస్లిమ్‌లు వీరి ఫిఖాను అనుసరించి సమస్యల్ని పరిష్కరించుకుంటూ దాని ప్రకారం ఆచరిస్తున్నారు. వీరు ఎంత గొప్పవారంటే వారి కాలంలోని చక్రవర్తి హారూన్ రషీద్ హజ్ కొరకు వెళ్ళి వీరిని మదీనాలో కలుసుకుని వీరు క్రోడీకరించిన "ముఅత్తా"ని విని వీరి శిష్యుడుగా మారిపొయ్యాడు.

ఇమామ్ మాలిక్ (రహ్మలై) ఇంతటి గొప్ప ఆలిమ్ ఎలా కాగలిగారో, రండి, ఈ రోజు మీకూ తెలియజేస్తాం. ఇమామ్ మాలిక్ (రహ్మలై) ఓ గొప్ప సహాబీ (రజి) కుమారులని మీకు తెలిసిందే. ప్రవక్త (స) అనుయాయులందరూ దైవప్రవక్త దగ్గరే ధర్మజ్ఞానాన్ని అభ్యసించి, వారి (స) ఆచరణను చూసి, దైవ ప్రసన్నతను పొందే విషయాలన్నిటినీ నేర్చుకున్నారు. ఆ విధంగా హజ్రత్ అనస్ (రజి) బాల్యంలోనే దైవ ప్రవక్త (స) సన్నిధికి వెళ్ళి వారికి అన్ని విధాలా సేవ చేసేవారు. ప్రవక్త (స) ఏ విధంగానయితే వారికి ధర్మజ్ఞానాన్ని నేర్పేవారో అదే మాదిరిగా వీరు కూడా తన ఇంటి వారికి ధర్మజ్ఞానాన్ని నేర్పేవారు.

ఇది తన తండ్రి ప్రయత్న ఫలమే. అయితే, అసలు విషయమేమంటే, దైవకృప వలన హజ్రత్ మాలిక్(రహ్మలై) మంచి వంశంలో జన్మించారు. దీనికితోడు దైవం వీరికి మంచి అవగాహనా శక్తిని కూడా ప్రసాదించాడు. శ్రమించే లక్షణంతోపాటు, విద్య నేర్చుకోవాలనే అభిలాష కూడా వారిలో ఉండేది. వీరు తన తండ్రి హజ్రత్ అనస్ (రజి) వద్ద ధార్మిక విద్యను అభ్యసించి నప్పటికీ ఆ రోజుల్లో మదీనాలో గొప్ప ఆలిమ్‌లు, ఇమామ్‌లు ఉండేవారు

కాబట్టి వారి శిష్యరికం కూడా చేసి, వారి వద్ద కూడా జ్ఞాన సముపార్జన గావించారు. తన తండ్రిగాక వీరి ఇతర గురువుల్లో, ఇమామ్ జొహరీ (రహ్మలై), ఇమామ్ యహ్యా (రహ్మలై), హజ్రత్ నాఫె, ముహమ్మద్ బిన్ మున్కిదర్, హష్షామ్ బిన్ అర్వా, జైద్ బిన్ అస్లమ్, హజ్రత్ రబియా బిన్ అబ్దుర్రహ్మాన్ ప్రభృతులు ఎంతో ప్రసిద్ధిచెందినవారు (దైవం వారందరితో రాజీ అగుగాక!). ఇమామ్ మాలిక్ గురువులందరూ ఆ కాలంలో ప్రసిద్ధి చెందినవారే. పెద్ద పెద్ద విద్యావంతులు సయితం వీరిని గొప్ప ఆలిమ్‌గా పరిగణించారు.

ఇమామ్ మాలిక్ (రహ్మలై) ఇమామ్‌లందరి వద్దకు వెళ్ళి వారు చెప్పిన హదీసుల్ని విని వాటిని కంఠస్థం చేసేవారు. దైవం వారికి మంచి జ్ఞాపక శక్తిని ప్రసాదించినప్పటికీ వారు ప్రతి హదీసును వ్రాసుకునేవారు. ఈ కారణంగా వారి వద్ద ఎన్నో హదీసులు జమ అయ్యాయి. వీరు ఖుర్‌ఆన్‌లోనేగాక, హదీసు విద్యలోనూ ఆలిమ్‌గా తయారయ్యారు. దైవం వీరికి ఖుర్‌ఆన్, హదీసుల్ని గ్రహించే శక్తిని ప్రసాదించాడు. వీటి సహాయంతో వీరు నిత్యజీవితంలో పనికివచ్చే ఎన్నో సమస్యలు, వాటి సమాధానాల్ని చెప్పడమేగాక వాటిని వ్రాసి ఉంచారు కూడా. ఇలా వ్రాసి, వ్రాసి ఓ పెద్ద గ్రంథాన్నే తయారుచేశారు. దాని పేరే "ముఅత్తా".

వీరు ఇంత గొప్ప ధార్మిక గురువులయిన తరువాత ఇంట్లో కూర్చొని ఉండక, జీవితాంతం ధార్మిక విద్యా వ్యాప్తిలో నిమగ్నులయ్యేవారు. ప్రజలకు ఖుర్‌ఆన్, హదీసుల్ని చదివి వినిపిస్తూండేవారు. ఇందుకు గాను వీరు మస్జిదె నబవిలో ఓ స్థలాన్ని ఎంచుకున్నారు. ఫజర్ నమాజ్ తరువాత కొంత ఎండ వచ్చేంత వరకు ఈ స్థలంలో కూర్చుని ధార్మిక విషయాల్ని బోధించేవారు. ప్రజలు గుమిగూడి విషయాల్ని వ్రాసుకుంటూ ఇంకా కొత్త కొత్త విషయాల్ని అడిగి తెలుసుకునేవారు. ఇమామ్ మాలిక్ వారి సందేహాలను తీర్చేవారు.

ఈ సందేహాలు-సమాధానాల పరంపర జీవితాంతం కొనసాగింది. మస్జిదె నబవిలో ఈ స్థలాన్ని ధార్మిక విద్యాలయంగా పరిగణించేవారు. వేలకొలది

దైవదాసులు ఈ పాఠశాల ద్వారా విద్యనభ్యసించారు. ఇక్కడ విద్యనభ్యసించే నిమిత్తం వందల మైళ్ళ నుండి విద్యార్థులు వచ్చేవారు. అరబ్‌కు పశ్చిమాన వందల మైళ్ళ దూరంలో ఉన్న స్పెయిన్ నుండి హజ్రత్ యహ్యా ఇక్కడకు వచ్చి చదువు నేర్చుకుని ఎంతో గొప్ప ఆలిమ్ అయ్యారు. స్పెయిన్ రాజు ఎంతో ప్రభావితుడై వీరిని తన రాజ్యానికి ప్రధాన న్యాయమూర్తిగా నియమించాడు. వీరు స్పెయిన్‌లో ధార్మిక విద్యను వ్యాపింపజేశారు. ఇమామ్ యహ్యా గాక ఇంకెందరో శిష్యులుండేవారు కాని, వారిలో ఇమామ్ షాఫయి ప్రసిద్ధి చెందారు.

ఈ పాఠశాలలో ఇమామ్ మాలిక్ ఎంతో ఓపికతో కూర్చుని తన శిష్యులకు అణకువ, సత్ప్రవర్తనలను బోధించేవారు. ఒకసారి ఖలీఫా హారూన్ రషీద్ హజ్ చేసుకుని మదీనాకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఇమామ్ మాలిక్ వద్దకు వచ్చి ఎన్నో కానుకల్ని, వేలకొలది రూపాయల్ని సమర్పించుకున్నారు.

ఇమామ్ సాహెబ్ క్రోడీకరించిన "ముఅత్తా"ను విని, ఖలీఫా సంతోషించి, "మీరు నాతో బగ్దాదుకు వచ్చి, అక్కణ్ణుండే ఈ విద్యను దేశ నలువైపులకు వ్యాపింపజేస్తే బాగుంటుంది" అని అన్నారు. అయితే ఇమామ్ సాహెబ్‌కు ప్రవక్త (స) పట్టణం ఎంతో ప్రియమయినది కావడం చేత అక్కణ్ణుంచి మరో చోటికి వెళ్ళాలనిపించేది కాదు. ఇంకో విషయమేంటంటే, ఖలీఫా వద్దకు వెళితే వారి ఆజ్ఞానుసారం నడుచుకోవాలి అని కూడా అనుకున్నారు. అందువలన బగ్దాదుకు వెళ్ళడానికి నిరాకరిస్తూ, "నేను ప్రవక్త (స) పట్టణం వదలి ఇంకెక్కడికీ వెళ్ళదల్చుకోలేదు. కావాలంటే మీరిచ్చిన కానుకల్ని వాపసు తీసుకెళ్ళగలరు" అని అన్నారు ఖలీఫాతో.

హారూన్ రషీద్ ఈ సందర్భంలో ఇమామ్ సాహెబ్‌తో ఇంకో విషయం కూడా అన్నారు - "ప్రస్తుతం రాజ్యంలో హనఫీ ఫిఖా అమలులో ఉంది. మీరు అంగీకరిస్తే మీ 'ముఅత్తా' ఫిఖాను అమలులోకి తీసుకురావడానికి ఉత్తర్వు జారీచేస్తాను."

దైవం ఇమామ్ మాలిక్ (రహ్మలై)కు ఎంతో మంచి మనసును ప్రసాదించాడు. ఇతర ఆలిమ్‌లంటే అసూయ, ద్వేష భావాల్ని ప్రదర్శించడానికి వీరు అల్లాటప్పా ఆలిమ్, ఇమామ్ కాదు. అప్పుడు వారు తలచుకుంటే ఇమామ్ అబూ హనీఫా (రహ్మలై) ఫిఖా స్థానంలో తన ఫిఖాను అమలు చేయించేవారే. అయితే వారు అలా చేయక ఖలీఫా హారూన్ రషీద్‌తో ఇలా అన్నారు - "హదీసు జ్ఞానం కేవలం నా ఒక్కడికే తెలుసా ఏమిటి? ప్రవక్త (స) అనుయాయులు ప్రతి చోటా ఈ జ్ఞానాన్ని వ్యాప్తి చేశారు. ఇమామ్ అబూ హనీఫా ఫిఖా ఎంత వరకైతే అమల్లో ఉందో అక్కడల్లా అది చెలామణి కావలసిందే."

ఎంత సద్గుణ సంపన్నులు ఇమామ్ మాలిక్ (రహ్మలై)! ఈ సందర్భంగా మనం ఆలోచించవలసిందేమిటంటే - నేటి ఓ ఆలిమ్ ఇంకో ఆలిమ్‌ని ద్వేషిస్తాడు. ఇంకా తన ముందు ఇతరుల మాటకు విలువ ఉండకూడదని భావిస్తాడు. గొప్ప ఆలిమ్ ఎలా ఉండాలో నేటి ఆలిమ్‌లు తెలుసుకోవాలి - హజ్రత్ ఇమామ్ మాలిక్ (రహ్మలై) ఓ గొప్ప ఆలిమ్‌కు ఓ నమూనా.

ఒకసారి ఖలీఫా వీరిని ఓ ఫత్వా (తీర్పు) అడిగారు. వీరు ఖుర్ఆన్, సున్నత్‌ల ప్రకారం పరిష్కారాన్ని సూచించారు. ఇది విని ఖలీఫా, "మీరు నేను సూచించినట్లు ఫత్వాను ఇవ్వండి" అని అన్నాడు. ఇమామ్ మాలిక్ (రహ్మలై) ఖుర్ఆన్, సున్నత్‌లకు వ్యతిరేకంగా ఫత్వాను ఇవ్వడానికి నిరాకరించారు. ఆ సమయంలో ఖలీఫా మౌనంగా ఉండిపోయాడుగాని, తరువాత తన సిపాయిలకు వీరిని గురించి సైగ చేశాడు. వారు ఇమామ్ మాలిక్ గారి ఓ రెక్కను విరిచేశారు. ఇది వారికి ఎంతో బాధాకరంగా ఉన్నప్పటికీ సహించి ఊరుకున్నారు. దీని తరువాత జైలు శిక్షను కూడా ఎంతో సహనంతో అనుభవించారు.

హజ్రత్ ఇమామ్ మాలిక్ 58 సంవత్సరాలు జీవించారు. జీవితాంతం ప్రజలకు దైవ ధర్మాన్ని బోధించారు. తన శిష్యులు, ఇంకా ఆ కాలంలో రాజులు సయితం వీరికి గొప్ప కానుకలు సమర్పించుకునే వారు. దైవ ప్రవక్త

(స) కానుకల్ని స్వీకరించమని తాకీదు చేశారు కాబట్టి ప్రతి రోజూ ప్రజలు పంపే ఎంతటి చిన్న కానుకనయినా వీరు స్వీకరించేవారు. తన ఆలుబిడ్డల కొరకు, దైవదాసుల కొరకు కూడా ఎంతో ఉదారంగా ఖర్చు చేసేవారు. ఇతర ప్రదేశాల నుండి తన వద్దకు విద్య నేర్చుకునేందుకు వచ్చే వారికి కూడా ఎంతో సొమ్మును దానం చేసేవారు. వీరి ఈ దాతృత్వం పట్ల విద్యార్థులు తమ ఆశ్చర్యాన్ని వెలిబుచ్చేవారు. స్పెయిన్ నుండి వచ్చిన హజ్రత్ యహ్యాకు ఎంతో సొమ్మును దానం చేయగా వారు స్వస్థలానికి తిరిగివెళ్ళేనాటికి పెద్ద సంపన్నులయిపోయారు. ఈ విధంగా ఇమామ్ షాఫయి (రహ్మలై)కు కూడా ఇలాంటి సొమ్మునే ఎన్నో సార్లు దానంగా ఇచ్చారు.

ఇమామ్ మాలిక్ (రహ్మలై) గారి ఆదర్శప్రాయమయిన ఓ దాతృత్వం హజ్రత్ షాఫయి (రహ్మలై)తో ముడివడి ఉంది. కాబట్టి ప్రస్తుతం మేము దాన్ని గురించి చెప్పదలచుకోలేదు. వీరికి చెందిన ఇతర విషయాల్ని గురించి ఇమామ్ షాఫయి (రహ్మలై) చరిత్రలో తెలుసుకోగలరు.

# ఇమామ్ షాఫయి (రహ్మలై)

ప్రియప్రవక్త (స) సహచరుల్లో హజ్రత్ సాయెబ్ (రజి) అనే ఓ మహనీయులుండేవారు. వీరి కుమారులయిన "షాఫ" ఎంతో ప్రసిద్ధిగాంచారు. ఆయన పెద్ద మనుమడు ఇద్రీస్. ఇద్రీస్ కుమారులే హజ్రత్ ఇమామ్ షాఫయి (రహ్మలై).

ఇమామ్ షాఫయి (రహ్మలై) గారి అసలు పేరు ముహమ్మద్. అయితే వీరి ముత్తాతగారి పేరుతో వీరు ప్రసిద్ధి చెందారు. ఈ పేరుతో ఎంతగా వినుతికెక్కారంటే ప్రజల్లో వీరి అసలు పేరు బహుకొద్ది మందికి మాత్రమే తెలుసు. అందరి నోటా వీరి పేరు 'ఇమామ్ షాఫయి' అనే ఉచ్చరించడం జరుగుతుంది. వీరు కూడా ఫిఖాలో గొప్ప ఆలిమ్. కోట్ల కొలది ముస్లిమ్‌లు నేడు వీరి ఫిఖాను అనుసరిస్తున్నారు.

వీరు పవిత్ర మక్కాలో ఉండేవారు. అక్కడే వీరు హిజ్రీ శకం 150, రజబ్ నెల 15వ తారీఖున జన్మించారు. సరిగ్గా అదే రోజు ఫిఖాలో ఆద్యులైన హజ్రత్ ఇమామ్ అబూ హనీఫా (రహ్మాలై) పరమపదించారు. అంటే దైవం అదే రోజు ఫిఖాలో పేరుగాంచిన ఓ ఆలిమ్‌ను తన వద్దకు పిలిపించుకుని మరో ఆలిమ్‌ని పుడమిపై ప్రభవింపజేశాడు.

వీరి తల్లిదండ్రులు ధర్మపరాయణులైన ఉత్తమ ముస్లిమ్‌లు. ఇమామ్ సాహెబ్‌కు మాటలు వచ్చిన తరువాత వీరి తల్లిదండ్రులు వీరిచేత ఖుర్‌ఆన్ పఠనాన్ని మొదలుపెట్టించారు. బాల్యంలోనే వీరు ఖుర్‌ఆన్‌ని కంఠస్థం చేశారు. ఇంత చిన్న వయస్సులోనే వీరు ఖుర్‌ఆన్‌ని కంఠస్థం చేయడం ప్రజల్ని ఆశ్చర్యంలో ముంచేసింది. వీరి జ్ఞాపక శక్తిని గురించి తెలుసుకున్న ప్రజలు ఈ బాలుడు మున్ముందు గొప్ప ఆలిమ్ అవుతాడని అనేవారు. ఇదంతా దైవకృప. తాను తలచినవారికి గౌరవాన్ని ప్రసాదిస్తాడు.

బాల్యదశలోనే ఖుర్‌ఆన్‌ని కంఠస్థం చేయడాన్ని చూసి వీరి తల్లిదండ్రులు వీరిని పవిత్ర మక్కాకు చేరువలో ఉన్న "హజేల్" అనే గ్రామానికి పంపారు. మంచి భాష మాట్లాడటంలో ఈ ఊరి ప్రజలు ప్రసిద్ధి చెందారు. అందుకనే వీరిని అక్కడికి పంపడం జరిగింది. రెండు మూడేండ్లు అక్కడ గడిపి మక్కా తిరిగివచ్చారు. తరువాత మక్కాలోని ఆలిమ్‌ల వద్ద ధార్మిక విద్యను అభ్యసించడం మొదలెట్టారు. ఈ దశలోనే తండ్రిగారు చనిపోయారు. తరువాత తల్లి సంరక్షణలో కాలం గడిచిపోయింది. ఆమె తన కుమారుని జ్ఞాపక శక్తిని చూసి, ఎలాగైనా తన కొడుకుని విద్యాభ్యాసానికి గొప్ప ఆలిమ్ వద్దకు పంపాలని నిర్ణయించుకుంది. దానికోసం ఆమె వారిని ఎంతో ఉత్సాహపరిచేవారు. ఎప్పుడూ ప్రోత్సాహకరంగా మాట్లాడేవారు, కాబట్టే వీరు కూడా పెద్ద పెద్ద ఇమామ్‌లను కలుసుకోవాలని తలుస్తూ దైవాన్ని వేడుకునేవారు. ఇమామ్ సాహెబ్ తన 14వ యేటలోనే మక్కా వెలుపల ఉన్న గొప్ప ఆలిమ్‌లను, ఇమామ్‌లను కలుసుకోవాలని ఎంతో తపించేవారు.

ఎట్టకేలకు ఇమామ్ సాహెబ్ దూర ప్రాంతాలకు వెళ్ళి విద్యనభ్యసించ డానికి అనుమతించమని తన తల్లిని అర్థించారు. దానిపై వారి తల్లి ఎంతో దిగులుపడిపోయారు. దీన్ని గమనించిన ఇమామ్ సాహెబ్, "అమ్మా! నీవు అంగీకరించకపోతే నేనెక్కడికీ వెళ్ళను, నీ సేవలోనే ఉంటాను" అని అన్నారు. "కుమారా! నేను అందుకు దిగులుపడలేదు, నేనైతే నీ విద్యాభివృద్ధి కొరకు ఎప్పుడూ దుఆ చేస్తుంటాను. నా బాధల్లా నీకు కనీసం రెండు రొట్టెలు చేసి పెడదామన్నా నా వద్ద చిల్లిగవ్వ కూడా లేదే అన్నదే" అని సమాధానమిచ్చారు వారి తల్లి. అయితే చివరికి ఎలాగోలా తన్నుతాను సంబాళించుకుని, "కుమారా! చింతించకు, నీవు ఎవరి ధర్మాన్నయితే అభ్యసించాలని వెళ్తున్నావో ఆ దైవమే నీకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాడు, ఆయనే జీవికను ప్రసాదిస్తాడు. ఇదంతా దైవదాసులకు అర్థం కాదు" అని అన్నారు.

ఎంత మంచి మాట పలికారు ఆమె! ఎంత మంచి మాతృమూర్తి ఆవిడ!! ఇలా అన్న తరువాత ఆమె రెండు దుప్పట్లను తీసి ఇమామ్ సాహెబ్‌కిస్తూ, "నాయనా! నీవు నాకు దైవం ఇచ్చిన 'అమానతు'వి, ఇప్పుడు నేను నిన్ను అతనికే అప్పజెబుతున్నాను. నేను సంపూర్ణ మనస్సుతో తలచేదేమంటే, దైవం నిన్ను ఎల్లవేళలా అన్ని విధాలా ఆపదల నుండి కాపాడు తాడని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను" అని అన్నారు. ఆ తరువాత కుమారుణ్ణి కౌగిలించుకుని ఇలా ప్రార్థించారు: "ఓ నా పోషకుడా! నేను నా ముద్దుల బిడ్డను ప్రియ ప్రవక్త (స) తెచ్చిన నీ ధర్మాన్ని అభ్యసించడానికి పంపిస్తున్నాను. ఓ నా ప్రభూ! నీవు నా మొరను ఆలకించి నా కుమారునిలో విద్యనభ్యసించే కోరికను జనింపజేశావు. దీన్ని సంపూర్ణం గావించు. అతనికి నీ సహాయాన్నందించు. ఇంకా నేను జీవించి ఉన్నప్పుడే అతన్ని నీ ధర్మంలో అందరికంటే గొప్ప ఆలిమ్‌గా తీర్చిదిద్దు. అలాంటి స్థితిలో నేనతన్ని చూసి, నీకు అధికంగా కృతజ్ఞతలు తెలుపుకోవాలి."

ఇలా ప్రార్థించాక తనయుని వీపుని చేత్తో నిమిరి ఇలా అన్నారు. "వెళ్ళు నాయనా! నిన్ను దైవానికి అంకితం చేశాను (దైవమే నీకు రక్షకుడు), 'ఫల్లాహు

**ఖైరున్ హాఫిజతన్ వహువ అర్‌హముర్రాహిమీన్'** *(దైవమే అందరికంటే ఎక్కువ సంరక్షకుడు. ఇంకా అతనే అందరికన్నా అధికంగా కరుణించేవాడు, కనికరించేవాడూను).*

ఈ విధంగా కుమారుణ్ణి సాగనంపారు. ఇమామ్ షాఫయి 14 సంవత్సరాల వయస్సులో ఒక్కరే పవిత్ర మక్కా నుండి మదీనాకు బయలుదేరారు. 'ఏదైనా బిడారు దొరికితే బాగుండు వారితో వెళ్ళడానికి' అని అనుకున్నారు మార్గంలో. ఇక దైవ కారుణ్యాన్ని చూడండి. "జిత్‌వా" అనే గ్రామం వరకు వెళ్ళారో లేదో ఓ బిడారు కలిసింది. అది జిత్‌వాలో బస చేసి ఉంది. ఇమామ్ సాహెబ్ అక్కడకు వెళ్ళి వారికి సలామ్ చేశారు. వారిలో ఓ మహనీయుడు వీరిని తన వద్దకు పిలిచి, "నాయనా! ఈ వేళ నీవు నాతోపాటు భోజనం చెయ్యాలి" అని అన్నారు.

ఇమామ్ సాహెబ్‌కు వారి తల్లిదండ్రులు మూడు వ్రేళ్ళతో అన్నం తినడం నేర్పారు. అలానే తినడం ప్రారంభించారు. వీరిని ఆహ్వానించిన ఆ మహనీయుడు, ఇంకా తతిమ్మా వారంతా ఐదు వ్రేళ్ళతో తింటున్నారు. దీన్ని గమనించి ఇమామ్ సాహెబ్ కూడా వారంతా తన్ను పరాయివాడని అనుకుంటారేమోనని తలపోసి ఐదేళ్ళతో తినడం ప్రారంభించారు. ఇమామ్ సాహెబ్ తన చేతిని అటు ఇటు పోనివ్వక తన ముందుభాగం నుండే భోజనం చేయడం పూర్తిచేసి ఈ దుఆ చదివారు, **"అల్ హమ్‌దులిల్లాహిల్లజీ అత్ అమనా, వ సఖానా వజఅల్‌నా మినల్ ముస్లిమీన్"** (మమ్మల్ని తినిపించి, త్రాపించి, నన్ను ముస్లిమ్‌లలో పుట్టించిన అల్లాహ్‌కు కృతజ్ఞతలు).

ఈ దుఆ తరువాత ఇమామ్ తనను భోజనానికి ఆహ్వానించిన ఆ పెద్ద మనిషికి కృతజ్ఞతలు తెలుపుకుని, అన్నపానీయాల్లో దైవం సమృద్ధిని ప్రసాదించాలని ప్రార్థించారు. ఇదంతా గమనించిన ఆ పెద్ద మనిషి ఇమామ్ షాఫయి దుఆ చేసిన తరువాత వారిని తన వద్ద కూర్చోబెట్టుకుని ఇలా మాట్లాడటం ప్రారంభించారు:

పెద్ద మనిషి :- నిన్ను చూస్తుంటే పవిత్ర మక్కా నివాసిలా కనిపిస్తున్నావు.

ఇమామ్ షాఫయి :- అవునండి, నేను ఆ పట్టణ నివాసినే.

పెద్ద మనిషి :- నా ఉద్దేశ్యంలో నీవు ఖురైష్ వంశానికి చెందిన వాడివై ఉంటావు.

ఇమామ్ షాఫయి :- అవును. నేను ఖురైష్ వంశీయుణ్ణే. మీ ఊహ సరి అయినదే. అయితే మీకు ఈ విషయాలన్నీ ఎలా తెలిశాయో చెప్పండి. మరుగున ఉన్న విషయాలు కేవలం దైవానికే తెలుసుగదా.

పెద్ద మనిషి :- కుమారా! ఇది తెలుసుకోవడం నాకేమంత కష్టమయింది కాదు. ఎందుకంటే నేను చాలా ప్రాంతాలు తిరిగాను. ఎన్నో పట్టణాలు, పల్లెసీమల్ని చూశాను. పెద్ద పెద్ద ఆలిమ్‌లనూ కలిశాను, నిరక్షరాస్యులనూ ఎరుగుదును. నీ అలవాట్లు, మాటలు గమనించి నీవు పట్టణవాసివై ఉంటావని అనుకున్నాను. ఖురైష్ వంశస్థుడవని భావించాను. ఎందుకంటే, ఖురైష్ వంశం ఇలాంటి మంచి అలవాట్లకు ప్రతీతి. వారు ఇతరులకు ఆతిథ్యమివ్వడంలో ప్రసిద్ధి. ఎవరయినా వారిని భోజనానికి పిలిస్తే వారు ఎప్పుడూ దాన్ని త్రోసిపుచ్చరు. నీవు కూడా అలాగే చేశావు.

ఇమామ్ షాఫయి :- ఏమండీ! ఇంతకు మీరే ప్రాంతంవారు?

పెద్ద మనిషి :- నేను ప్రియప్రవక్త (స) పట్టణమయిన మదీనా నివాసిని.

ఇమామ్ షాఫయి :- అయితే, ప్రస్తుతం మదీనాలో గొప్ప ఆలిమ్ ఎవరో చెప్పగలరా?

పెద్ద మనిషి :- మదీనాలో ప్రస్తుతం హజ్రత్ ఇమామ్ మాలిక్ గొప్ప ఆలిమ్. దైవం వారి గౌరవాన్ని ఇంకా అధికం చేయుగాక!

ఇమామ్ షాఫయి :- దైవం మీ దుఆను స్వీకరించి, నా దుఆను కూడా ఆలకించుగాక.

పెద్ద మనిషి :- ఏమిటీ, నీవు ధార్మిక విద్యనభ్యసించడానికి మదీనా వెళ్తున్నావా?

ఇమామ్ షాఫయి :- అవునండీ, మనసులోనైతే అదే కోరిక ఉంది. (మళ్ళీ దుఆ చేశారు.)

పెద్ద మనిషి :- నీవు విద్య నభ్యసించడానికి బయల్దేరివుంటావని నేను ముందుగానే పసిగట్టాను. ఏమైనా నీవు విద్యాభిలాషివిలా కనిపిస్తున్నావు. అయితే విను, దైవం నీ ప్రార్థనను ఆలకించాడు. చూడబ్బాయీ, నీవు దైవ ధర్మాన్ని అభ్యసించడానికి వెళ్తున్నావు. కాబట్టి నీవు దేవుని అతిథివి. నీకు సహాయం చేయడం మా విధి. అటు చూడు, అక్కడ అన్నింటికంటే ఓ మంచి ఒంటె నిలబడి ఉంది. దానిపై సామాను కూడా కట్టివుంచాము. దానిపైనే మేము నిన్ను మదీనాకు చేర్చుతాం.

ఆ పెద్ద మనిషి మాటలు విని ఇమామ్ సాహెబ్ ఎంతో సంతోషించారు. మనసులోనే దైవానికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. తరువాత బిడారు బయలుదేరగా ఇమామ్ సాహెబ్ ఒంటెపై కూర్చుని పారాయణం చేయడం ప్రారంభించారు. దారి పొడుగునా పారాయణం కొనసాగించారు. పగలు ఓ పూర్తి ఖుర్‌ఆన్, రాత్రి ఓ పూర్తి ఖుర్‌ఆన్ చదివేవారు. స్వయంగా వారే తెలిపారు- మొత్తం మీద మదీనా చేరే వరకు పదహారుమార్లు పూర్తి ఖుర్‌ఆన్‌ను పారాయణం చేశానని.

ఇమామ్ సాహెబ్‌కు బాల్యం నుండే ప్రవక్త (స) పట్ల ఎంతో గౌరవభావం ఏర్పడింది. అలాగే మదీనాపై కూడా ఎంతో మక్కువ ఉండింది. మదీనా సమీపించేకొద్దీ తొందరగా వస్తే బావుండు అని భావించేవారు. ఎనిమిదవ రోజు బిడారు మదీనా చేరింది. ఇమామ్ సాహెబ్ సంతోషంతో తబ్బిబ్బయ్యారు. అది అసర్ వేళ. తిన్నగా వారు మస్జిదె నబవికి వెళ్ళారు. సామూహిక నమాజ్ ముగిసిన కారణంగా వారు ఒంటరిగానే నమాజ్ ఆచరించి, అటూ ఇటూ తన దృష్టిని సారించగా, ఓ చోట ఓ మహనీయుడు కూర్చుని ఉండటం చూశారు. వారి ముఖం కాంతితో ప్రకాశిస్తూంది. జనం వారి చుట్టూ గుమికూడటం ప్రారంభించారు. దాన్ని గమనించి ఇమామ్ సాహెబ్ కూడా అక్కడికెళ్ళి కూర్చున్నారు. ఆ మహనీయుడు ఒక దుప్పటిని లుంగీగా కట్టుకుని, మరొక

దుప్పటిని తల మీదుగా కప్పుకుని ఉన్నారు. బిడారులో ఇమామ్‌గారు, ఇమామ్ మాలిక్ రంగు, రూపాన్ని గురించి విని ఉన్నారు. దాన్నిబట్టి ఇమామ్ మాలిక్ వీరే అయివుంటారని గ్రహించారు షాఫయి. తరువాత ఇమామ్ మాలిక్ హదీసు పాఠాన్ని బోధించడం ప్రారంభించాక వీరే ఆ మహనీయుడై వుంటారని నిర్ధారించుకున్నారు. వారు హదీసు పాఠాన్ని ఈ విధంగా ప్రారంభించారు:

"నాతో నాఫె; నాఫె, అబ్దుల్లా ఇబ్నె ఉమర్‌తో ఇలా అన్నారు : సమాధిలో (విశ్రాంతి తీసుకుంటున్న) ఉన్న వారు నాతో అన్నారు - " ఇలా అంటూ ఇమామ్ మాలిక్ (రహ్మలై) తన కుడి చేత్తో ప్రియప్రవక్త (స) పవిత్ర సమాధి వైపునకు సైగ చేస్తూ పూర్తి హదీసును విన్పించారు.

స్వయంగా ఇమామ్ షాఫయి (రహ్మలై) ఇలా అంటున్నారు: "ఇమామ్ మాలిక్ ద్వారా హదీసు బోధనని విని నాలో ఓ విధమయిన భయం చోటు చేసుకుంది. వారు ఏ హదీసు విన్పించినా దాని మూలాధారాలు కూడా ఇస్తారు - అంటే నేను ఫలానా వారితో, అతను ఫలానా వారితో విని ఉల్లేఖిస్తున్నారని. ఇలా వరుసక్రమంలో ప్రవక్త (స) పేరు రాగానే తన కుడి చేత్తో ప్రవక్త (స) సమాధి★ వైపునకు సైగ చేస్తూ పై మాదిరిగా హదీసును వినిపిస్తారు.

వినేవారు ఇమామ్ మాలిక్ ఉల్లేఖించిన హదీసుల్ని వ్రాసుకునేవారు. ఇమామ్ షాఫయి వద్ద కలం లేదు, సిరాబుడ్డీ లేదు. వారు ఓ పుల్లను తీసు కుని, దాన్ని నోటిలో ఉంచి తడిచేసి, తన చేతిపై హదీసును వ్రాసుకునేవారు. వీరు తన ధ్యాసలో ఈ విధంగా చేస్తూ ఉండటాన్ని చూసిన ఇమామ్ మాలిక్‌కు కోపం వచ్చేసింది. ఇమామ్ మాలిక్ ఇరవై అయిదు హదీసుల్ని బోధించి తన పాఠాన్ని ముగించారు. తరువాత ప్రజలంతా వెళ్ళాక ఇమామ్ మాలిక్ ఒక్కరే

---

★ *ప్రియప్రవక్త (స) సమాధి మస్జిదె నబవిలో కుడివైపున ఉన్నది. దాని చుట్టూ గోడలు కట్టి పైకప్పుపై ఓ గుంబద్‌ను నిర్మించారు. ఎందుకంటే కప్పు పైభాగాన ఎక్కినవారు సమాధిని గుర్తించాలని అలా గుంబద్‌ను నిర్మించారు. దాని రంగు ఆకుపచ్చ.*

కూర్చుని ఉన్నారు. ఇమామ్ షాఫయి కూడా కూర్చున్నారు. కూర్చోక మరెక్కడికెళతారు? మదీనాలో వారికి బంధుమిత్రులు ఎవరూ లేరు. వారి వంశీయులూ లేరు. తరువాత ఇమామ్ మాలిక్ వీరికి సైగ చేసి తన వద్దకు పిలిపించుకున్నారు. ఇమామ్ షాఫయి ఎంతో వినయంతో వెళ్ళి వారి వద్ద కూర్చున్నారు. ఇమామ్ మాలిక్ వారిని తదేకంగా చూసి అడిగారు, "మీరు హరమ్ (కాబా) నివాసియా?" "అవునండి, నేను పవిత్ర మక్కాలోనే ఉంటాను" అని ఇమామ్ షాఫయి సమాధానమిచ్చారు.

ఆ పిదప ఇమామ్ మాలిక్ (రహ్మలై) అన్నారు, "మీలో నేను ఎన్నో మంచి లక్షణాలు చూస్తున్నాను. మీరెంతో వివేకం కలవారిలా చక్కగా మాట్లాడుతారు, చదువుకున్న వారిలా కూడా కనపడుతున్నారు, కాని మీరు ఇప్పుడిప్పుడే ఓ అనాలోచిత పనిని చేశారు."

ఈ మాటలు విన్న ఇమామ్ షాఫయి ఒక్కసారి ఉలిక్కిపడి, "అయ్యా! నేను అలాంటి ఏ పని చేశానో సెలవియ్యండి" అని అన్నారు. "నేను హదీసు పాఠాన్ని బోధిస్తున్నప్పుడు, మీరు పిల్లల మాదిరిగా ఓ పుల్లతో ఆడుకుంటున్నారు" అని ఇమామ్ మాలిక్ అన్నారు.

"నేను ఆడుకోవడంలేదు. నా వద్ద సిరాబుడ్డి, కలం లేనందువల్ల నా అరచేతిలో పుల్లతో హదీసును వ్రాసుకున్నాన"ని బదులిచ్చారు షాఫయి.

"ఏదీ మీ అరచేయి ఇలా ఇవ్వండి" అని ఇమామ్ మాలిక్ షాఫయిగారి చేతిని తీసుకుని చూసి, "ఏదీ ఇందులో ఏమీ కనిపించడం లేదే?" అని అన్నారు.

"అయ్యా! జ్ఞాపకముంచుకోవడానికి ఇదో పద్ధతి. సిరా, కలం లేకుండా అరచేతిలో అక్షరాల్నయితే వ్రాయలేము కదా! మీ నుండి విన్న ప్రతి హదీసును నా హృదయఫలకంపై వ్రాసుకున్నాను. మీరు ఆజ్ఞ ఇస్తే విన్పిస్తాను" అని షాఫయి అన్నారు.

ఇమామ్ మాలిక్ ఆశ్చర్యపోతూ, "అయితే విన్పించండి" అని అన్నారు. తరువాత ఇమామ్ షాఫయి హదీసును విన్పించడం మొదలెట్టారు.

"నాతో నాఫె, నాఫెతో అబ్దుల్లా ఇబ్నె ఉమర్ ఉల్లేఖించారు. ఆ సమాధిలో ఉన్నవారు ఇలా సెలవిచ్చారు...." (ఈ విధంగా అంటూ ఇమామ్ మాలిక్ మాదిరిగా దైవ ప్రవక్త (స) పవిత్ర సమాధి వైపునకు తన కుడి చేత్తో సైగ చేశారు.) ఇలా వరుసగా పాతిక హదీసుల్ని విన్పించారు. ఇమామ్ మాలిక్ హదీసులు విని సంతోషించి ఆశ్చర్యపోతూ - దైవం ఎంతటి మంచి జ్ఞాపక శక్తిని ప్రసాదించాడు ఈ పిల్లవాడికి అని అనుకున్నారు.

స్తోత్రం కేవలం అల్లాహ్ కొరకే.

ఇక మగ్‌రిబ్ వేళ అయింది. నమాజ్ తరువాత ఇమామ్ మాలిక్ తన సేవకునితో, "ఈ అయ్యగారిని మన ఇంటికి తీసుకెళ్ళు" అని నా వైపు చూపించారు. సేవకుడు నన్ను ఇమామ్ మాలిక్ ఇంటికి తీసికెళ్ళి ఓ గదిలో కూర్చోబెట్టాడు. పిదప కాబా ఫలానా దిక్కున ఉందని చెప్పి, ఇది చెంబు, ఇది మలమూత్ర విసర్జనశాల, ఇది మీరు విశ్రమించే పడక అని వివరాలు చెప్పాడు.

అంతలో ఇమామ్ మాలిక్ వచ్చారు. వారితోపాటు కూడా ఓ నౌకరు ఉన్నాడు. అతని చేతిలో ఓ పళ్ళెరం ఉంది. ఇమామ్ మాలిక్ నౌకరు నుండి దాన్ని తీసుకుని పక్కనబెట్టి ఎంతో ఆదరంగా నాకు సలామ్ చేశారు. తరువాత నౌకరుతో "చేతులు శుభ్రం చేసుకునే ఏర్పాటు చేయి" అని అన్నారు. నౌకరు ముందు అతిథి చేతులు కడిగించడానికి వెళ్ళగా ఇమామ్ మాలిక్ నివారిస్తూ, "మొదట ఆతిథ్యమిచ్చేవాని చేతులు శుభ్రం చేయించాలి, భోజనం అయిన పిదప మొదట అతిథి చేతులు శుభ్రం చేయించాలి" అని అన్నారు.

ఇమామ్ షాఫయి, "ఇక్కడ నాకో కొత్త విషయం తెలిసింది. అది నాకు నచ్చింది" అని అన్నారు. తరువాత ఇమామ్ షాఫయి, ఇమామ్ మాలిక్‌ని కారణం అడగగా వారు, "అసలు విషయం ఏమిటంటే, ఆతిథ్యమిచ్చేవాడు అతిథిని ఆహ్వానిస్తాడు. ఎందుకంటే భోజన స్థలానికి ముందు తనే రావాలి, ఆపై ఓ క్రమపద్ధతిలో వడ్డించాలి, భోజనం ముగించాక ఇంకా ఎవరయినా

అతిథులు వస్తే వాళ్ళతో కలిసి తను కూడా కొంచెం తినడానికి వీలుగా ఆతిథ్యమిచ్చే వ్యక్తి మొదట చెయ్యి కడుక్కోవాలి" అని చెప్పారు.

భోజనాలయ్యాక కబుర్లు మొదలయ్యాయి. ఇమామ్ మాలిక్ కూడా కూర్చుని, విశేషాలేమిటని అడిగారు. మక్కా వారి సంగతులు కూడా అడిగి తెలుసుకున్నారు. అలా రాత్రి చీకట్లు కమ్ముకోగా, "బాటసారులు కాబట్టి మీరు బాగా అలసిపోయి వుంటారు, విశ్రాంతి తీసుకోండి" అనేసి వెళ్ళిపోయారు ఇమామ్ మాలిక్. పిదప ఇమామ్ షాఫయి ఎంతో హాయిగా నిద్రపోయారు.

తెల్లవారుఝామున స్వయంగా ఇమామ్ మాలిక్‌యే వచ్చి ఇమామ్ షాఫయిని నిద్రలేపారు. ఇమామ్ షాఫయి మేల్కొని చూస్తే ఏముందీ - ఇమామ్ మాలిక్ నీళ్ళ చెంబుతో ఎదురుగా నిల్చొని ఉన్నారు. దీన్ని గమనించిన ఇమామ్ షాఫయి ఎంతో సిగ్గుపడి వారి నుండి నీళ్ళ చెంబును తీసుకోలేకపొయ్యారు. వారి పరిస్థితిని చూసిన ఇమామ్ మాలిక్ ఇలా అన్నారు, "సోదరా! ఇందులో సిగ్గుపడవలసిందేముంది? మీరు నా అతిథి. అతిథి సత్కారం చేయమని స్వయంగా ప్రవక్త (స) గారే సెలవిచ్చారు. అదీ మీ లాంటి ధార్మిక విద్యను అభ్యసించడానికి వచ్చిన వ్యక్తి, దైవం, దైవప్రవక్త (స) తరపున వచ్చిన అతిథిగా పరిగణించబడతాడు."

ఇది విన్నాక ఇమామ్ షాఫయికి ధైర్యం వచ్చేసింది. నీటి చెంబును తీసుకుని మస్జిదె నబవికి వెళ్ళే ప్రయత్నం చేశారు. మస్జిద్‌కు వెళ్ళి సున్నత్ నమాజ్ తరువాత సామూహిక (ఫర్జ్) నమాజ్ కూడా చేశారు. ఇమామ్ మాలిక్ నమాజ్ చేయించారు. నమాజ్ ముగిశాక ఇమామ్ మాలిక్ ముసల్లా (నమాజ్ చేయడానికి ఉపయోగించే చాప లేక దుప్పటి)పై కూర్చుని దైవ నామాన్ని స్మరిస్తూ కొండలపై నుంచి సూర్య కిరణాలు ప్రసరిస్తుండగా తన పాఠాన్ని ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. జనమంతా వారి చుట్టూ చేరారు. ఇమామ్ గారు తన పుస్తకం 'ముఅత్తా'ను ఇమామ్ షాఫయి చేతికిచ్చి, 'దీన్ని చదివి అందరికీ విన్పించండి' అని అన్నారు. అలాగే ఇమామ్ షాఫయి విన్పించడం

మొదలెట్టారు. ప్రజలు దాన్ని వ్రాయడం ప్రారంభించారు. ఈ విధంగా ఇమామ్ షాఫయి, ఇమామ్ మాలిక్ ఆజ్ఞానుసారం ఎనిమిది నెలలపాటు 'ముఅత్తా'ను విన్పించారు. ఆ పుస్తకం మొత్తం వారికి కంఠోపాఠమయ్యింది.

ఈ ఎనిమిది నెలలూ తన ఇంటనే ఉంచి వారి ఖర్చునంతా భరించారు ఇమామ్ మాలిక్. ఇది చూసి ప్రజలు ఇమామ్ షాఫయి కూడా వారి ఇంటి సభ్యుల్లోని ఒకరని తలచేవారు. ఆ కాలంలోనే హజ్ రోజులు ప్రారంభమై ఈజిప్ట్ నుండి ప్రజలు వచ్చారు. ఆ వచ్చినవారు 'ముఅత్తా'ని వినాలని కోరగా ఇమామ్ సాహెబ్ అనుమతితో వారికి 'ముఅత్తా'ని విన్పించారు ఇమామ్ షాఫయి. వీరెళ్ళిన పిదప ఇరాఖ్ ప్రజలు వచ్చారు. వీరిలో ఓ యువకుడున్నాడు. అతను మంచి నడవడిగలవాడిలా కన్పించాడు ఇమామ్ షాఫయికి. క్రమం తప్పకుండా రోజూ నమాజ్ కూడా ఆచరిస్తున్నాడు. నమాజ్ ముగించాక ఇమామ్ షాఫయి అతన్ని అడిగారు:

"సోదరా! మీరు ఏ ప్రాంతం వారు?"

"నా స్వస్థలం ఇరాఖ్" అతను జవాబిచ్చాడు.

"ఇరాఖ్‌లో ఏ పట్టణానికి చెందినవారు?"

"కూఫా".

కూఫా పేరు విన్నంతనే ఇమామ్ షాఫయికి ఇమామ్ అబూహనీఫా గుర్తుకువచ్చి వెంటనే అడిగారు:

"సోదరా! ప్రస్తుతం కూఫాలో ధార్మికంగా ఏ ఆలిమ్ ముందంజలో ఉన్నారు?"

"ప్రస్తుతం ఇమామ్ అబూ యూసుఫ్, ఇమామ్ ముహమ్మద్ బిన్ హసన్ కూఫాలో పేరుమోసిన ఆలిమ్‌లు. ఇరువురు కూడా ఇమామ్ అబూ హనీఫాగారి శ్రేష్ఠులయిన శిష్యులే" అని అన్నాడు ఆ యువకుడు.

"మంచిది, సోదరా! మీరు ఇరాఖ్‌కు తిరిగి ఎప్పుడెళతారో సెలవిస్తారా?" ప్రశ్నించారు ఇమామ్ షాఫయి.

"రేపు ఉదయాన్నే మేమిక్కణ్ణుండి బయలుదేరుతున్నాం."

ఇది విన్న వెంటనే ఇమామ్ షాఫయి పరుగెత్తుకుంటూ ఇమామ్ మాలిక్ వద్దకు చేరి ఇలా అన్నారు: "గురువుగారూ! విద్యాసముపార్జనకై నేను ఇంటి నుండి బయలుదేరానన్న విషయం మీకు తెలిసిందే. కూఫాలో కూడా హదీసు విద్య తెలిసిన మహామహులున్నారన్న విషయం విన్నాను. ఇది మంచి అవకాశం. రేపు బిడారు ఇరాఖ్‌కు పయనమవుతుంది. మీరు ఆజ్ఞాపిస్తే నేను ఆ బిడారు వెంట కూఫాకు చేరుకుంటాను."

తన ప్రియ శిష్యుని అభిరుచి చూసి ఇమామ్ మాలిక్ శెభాష్! అని మెచ్చుకుంటూ దుఆ చేశారు. "తప్పకుండా వెళ్ళాల్సిందే. ధార్మిక విద్యార్జన కొరకు వెళ్ళే వ్యక్తికై మార్గం నిండా దైవదూతలు తమ రెక్కల్ని పరుస్తారు. విద్య వలన ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయి" అని అన్నారు ఆయన.

ఇమామ్ మాలిక్ రాత్రంతా తన శిష్యునికై ప్రయాణ ఏర్పాట్లు చేశారు. తెల్లవారాక శిష్యుని తీసుకుని ఆ బిడారు వద్దకు చేరి ఓ మంచి ఒంటెను అద్దెకు తీసుకున్నారు. ఇమామ్ షాఫయి అయితే ఆశ్చర్యంలో మునిగిపోయారు. ఎందుకంటే, రాత్రి వరకయితే తన గురువుగారి వద్దగాని, తన వద్దగాని ఒక్క పైసా కూడా లేకుండింది. అయినా తన గురువుగారు ఎంతో మంచి ఒంటెను కిరాయికి తీసుకున్నారు. దీనిపై నా ఈ ఆశ్చర్యాన్ని వారికి తెలుపగా వారు దైవ కారుణ్యంపై ఓ సంఘటనను ఈ విధంగా విన్పించారు:

"సోదరా! వాస్తవానికి రాత్రి వరకు నా వద్ద ఏమీ లేదు. అయితే ఎవరో తలుపుతట్టగా, వెళ్ళి తలుపు తీసి చూడగా అబ్దుర్రహ్మాన్ బిన్ ఖాసిమ్ నిల్చొని ఉన్నారు. వారి చేతిలో ఓ సంచి ఉంది. చాలా బలవంతాన అయన ఆ కానుకను నాకు సమర్పించి వెళ్ళారు. ఇంట్లోకి వెళ్ళి ఆ సంచి తెరచి చూస్తే అందులో వంద దీనార్లు (బంగారు నాణాలు) ఉన్నాయి. దేవుడు తన ప్రత్యేక కారుణ్యానుగ్రహంతో మీ ప్రయాణ ఏర్పాటు చేసినందుకు ఆయనకు నేను కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అందులోంచి ఏభై దీనార్లు ఇంటి

ఖర్చులకు అట్టిపెట్టి తతిమ్మా దీనార్లు మీ ప్రయాణానికై తీసుకువచ్చాను. ఇదిగో వీటిని తీసుకుని మీరూ దైవానికి కృతజ్ఞతలు తెలుపుకోండి."

ఇమామ్ మాలిక్ గారు తన పట్ల చూపిన ఈ వాత్సల్యంపై ఇమామ్ షాఫయి కళ్ళు చెమ్మగిల్లాయి. మాట ప్రకారం అద్దె బాపతు నాలుగు దీనార్లు ఒంటె యజమానికిచ్చారు. బిడారు బయలుదేరింది. కంటికి కన్పించేంత వరకు ఆ బిడారును అట్టే చూస్తుండిపోయారు ఇమామ్ మాలిక్. 24వ రోజు ఇమామ్ షాఫయి కూఫా చేరుకున్నారు. అది అస్ర్ వేళ. నమాజ్కై మస్జిద్‌లోకి వెళ్ళేసరికి అప్పటికే సామూహిక నమాజ్ ముగిసింది. ఓ మూలన ఏకాంతంగా ఓ యువకుడు నమాజ్ చేస్తుండటాన్ని ఇమామ్ షాఫయి గమనించారు. అతను సరిగ్గా నమాజ్ చేయలేదన్న విషయాన్ని గమనించి అతన్ని వారిస్తూ నమాజ్ చేస్తే శ్రద్ధగా చేయాలని అన్నారు ఇమామ్ షాఫయి అతనితో. దీనిపై ఆ యువకుడు బిగుసుకుపోయి ఏదో వాగుతూ, వూగుతూ బయటికి వెళ్ళిపోయాడు. వాకిట్లో ఎదురుపడ్డ ఇమామ్ అబూ యూసుఫ్, ఇమామ్ ముహమ్మద్ బిన్ హసన్ ఏమయిందని ఆ యువకుణ్ణి అడిగారు. అతనన్నాడు, "అయ్యా! నేను మీతో పాటు 15 ఏళ్ళుగా నమాజ్ చేస్తున్నాను. మీరెప్పుడూ నా నమాజ్ పట్ల వంకబెట్టలేదు. అదిగో ఆ మూలన నమాజ్ చేస్తున్న యువకుడు ఎక్కణ్ణుంచో వచ్చి నేను సరిగ్గా నమాజ్ చేయలేదని అంటున్నాడు, హజాజీలా (అరేబియాలోని ఓ ప్రాంతం పేరు) కన్పిస్తున్నాడు. హజాజీలే ఇలా అనాలోచితంగా మాట్లాడతారు" అన్నాడు ఆ యువకుడు.

దీనిపై ఆ ఇద్దరు మహనీయులు ఆ కొత్త యువకుని వంక చూసి - ఈ హజాజీ యువకుడు చదువుకున్న వానిలా కన్పిస్తున్నాడని అనుకున్నారు. ఆ తరువాత వారిద్దరు ఆ ఇరాఖీ యువకునితో, "వెళ్ళి, నమాజ్ చేసే సరియైన పద్ధతి ఏమిటో తెలుసుకో" అని అన్నారు. అలాగే ఆ యువకుడు వెళ్ళి అడిగాడు. సమాధానంగా ఇమామ్ షాఫయి రెండు ఫర్జ్‌లతో, ఒక సున్నత్‌తో నమాజ్ ప్రారంభించాలని అన్నారు.

ఇమామ్ అబూ యూసుఫ్, ఇమామ్ ముహమ్మద్ బిన్ హసన్ ఈ సమాధానం వినగానే - ఎవరో పెద్ద ఆలిమ్ వచ్చారని గ్రహించారు. తరువాత వీరిరువురూ మళ్ళీ ఆ ఇరాఖీ యువకునితోనే, "వెళ్ళి ఆ రెండు ఫర్జ్‌లు, ఓ సున్నత్ లేమిటో కనుక్కుని రా" అని పురమాయించారు.

ఇమామ్ షాఫయి సమాధానంగా ఇలా చెప్పారు - "ఆ రెండు ఫరజుల్లో ఒకటి: సంకల్పం, రెండవది: తక్బీరె తహ్‌రీమా పఠించాలి. అంటే నమాజ్‌కు ముందు అల్లాహు అక్బర్ అని పలకాలి. తరువాత ఓ సున్నత్ ఏమిటంటే, తక్బీరె తహ్‌రీమా పఠిస్తూ రెండు చేతులూ చెవుల వరకు ఎత్తాలి." ఈ సమాధానం విని ఈ ఇద్దరు పెద్దలు మస్జిద్‌లోకి వెళ్ళారు. 16 లేక 17 ఏళ్ళ యువకునిగా కన్పించిన ఆ కొత్త యువకుణ్ణి ఇమామ్ షాఫయిగా వారు నమ్మలేకపోయారు. మళ్ళీ ఆ మొదటి యువకుణ్ణే పిలిచి, "వెళ్ళి, వారిని (ఇమామ్ షాఫయిని) ఇక్కడకు తీసుకురా" అని పంపించి, వారిద్దరూ మస్జిద్‌లో ఓ మూలన కూర్చు న్నారు. ఆ యువకుడు వెళ్ళి "పదండి, మా ఆలిమ్‌ల వద్దకు" అని ఇమామ్ షాఫయితో అన్నాడు. ఇమామ్ షాఫయి దీన్ని గ్రహించి, "దప్పిక గొన్న వాడు బావి దగ్గరకు వెళతాడో లేదా బావే దప్పికగొన్న వ్యక్తి వద్దకు వస్తుందో కనుక్కునిరాపో" అని ఆ యువకునితో అన్నారు.

ఈ జవాబు విన్న ఆ ఇద్దరు ఆలిమ్‌లు ఆ కొత్త యువకుడు సమాధానం కూడా ఎంతో ఉన్నతమయిన భాషా తీరులో చెబుతున్నాడని గ్రహించారు. తరువాత ఇద్దరూ, ఇమామ్ షాఫయి దగ్గరకు వెళ్ళి సలామ్ చేశారు. దీనిపై ఇమామ్ షాఫయి ఎంతో సిగ్గుతో దిగ్గునలేచి ప్రతి సలామ్ చేసి చేతులు కలిపారు. అందరూ కూర్చున్నాక ఇద్దరు ఇమామ్‌లు పరిస్థితి విచారించగా ఈ పదహారేళ్ళ యువకునికి 'ముఅత్తా' కూడా కంఠోపాఠమేనన్న విషయం తెలియవచ్చింది. తరువాత రెండు మూడు సమస్యలడిగి 'ముఅత్తా'లో వీటి పరిష్కారమేమి టన్నారు. ఇమామ్ షాఫయి వాటికి సమాధానాలివ్వగా ఆ ఇద్దరూ సంతోషిస్తూ నౌకరును పిలిచి, "వీరిని మన ఇంటికి తీసుకెళ్ళు" అని అన్నారు. ఇమామ్

షాఫయి నౌకరు వెంట మస్జిద్ బయటి గుమ్మం దగ్గరికి వచ్చి చూడగా జీను వేయబడిన ఓ కంచర గాడిద నిల్చొని ఉంది, నౌకరు వీరిని దానిపై కూర్చుండబెట్టాడు. స్వయంగా ఇమామ్ షాఫయియే ఇలా అంటున్నారు, “నేను పాత బట్టలు ధరించి కంచర గాడిదపై కూర్చున్నప్పుడు ఎంతో సిగ్గేసింది. నన్ను గమనించినవారు తదేకంగా నా వైపు చూస్తుండిపోయారు.” ఇలా ఇమామ్ షాఫయి, ఇమామ్ ముహమ్మద్ బిన్ హసన్‌గారి మహల్‌కు చేరుకున్నారు. నౌకరు వీరిని సవారీపై నుండి దించాడు. ఇంత అట్టహాసమైన దర్బారులో ఇమామ్ ముహమ్మద్ నివసిస్తున్నారన్న విషయం తెలుసుకుని ఇమామ్ షాఫయి ఏడ్వడం ప్రారంభించారు. అంతలో ఇమామ్ ముహమ్మద్ వచ్చి, “విచారపడ కండి. ఈ మహల్ నా హలాల్ (ధర్మ సంపాదన) సొమ్ముతో నిర్మించబడింది. దైవకృప వలన నేను ప్రతి యేడూ జకాత్ కూడా చెల్లిస్తున్నాను” అని అన్నారు. ఇలాంటివే కొన్ని విషయాలు చెప్పేసి ఇమామ్ షాఫయిని లోపలికి తీసుకెళ్ళారు. ఖరీదైన ఓ జత బట్టల్ని ధరించడానికిచ్చారు. ఇమామ్ షాఫయి స్నానాదులు పూర్తిచేసి వాటిని ధరించారు. ఇక సంభాషణ మొదలయింది. ఇమామ్ ముహమ్మద్ బిన్ హసన్ తన పుస్తకాల్ని చూపించి, “వీటిలో మీ ఇష్టమొచ్చిన పుస్తకాన్ని తీసి చదువుకోండి” అని ఇమామ్ షాఫయితో అన్నారు.

అలాగే ఇమామ్ షాఫయి రాత్రివేళ చదువుకోవడానికిగాను ఓ పుస్తకం తీసుకున్నారు. తెల్లారిన తరువాత ఇమామ్ ముహమ్మద్ బిన్ హసన్ ఇమామ్ షాఫయికి ఆ పుస్తకం మొత్తం కంఠోపాఠమయిందన్న విషయం తెలుసుకుని ఆశ్చర్యపోయారు. ఇంత చిన్న వయసుగల ఈ బాలుడికి ఇంతటి జ్ఞాపకశక్తినిచ్చిన దైవానికి ఆయన కృతజ్ఞతలర్పించుకున్నారు.

ఇమామ్ షాఫయి, ఇమామ్ ముహమ్మద్ వద్దనే చాలా కాలం గడిపారు. తరచుగా తల్లి జ్ఞాపకం వచ్చేది. ఓ రోజు వారు ఇమామ్ ముహమ్మద్ గారి దగ్గరికెళ్ళి, ఇక సొంతూరుకెళ్ళిపోవడానికి అనుమతించమని అడిగారు. ఈ విషయం విని ఇమామ్ ముహమ్మద్ తన ఆస్తిపాస్తుల్లో సగం వాటాను ఇమామ్

షాఫయి ముందుంచి, "వీటిని స్వీకరించినట్లయితేనే మీకు అనుమతి లభిస్తుంది" అని అన్నారు. సమాధానంగా ఇమామ్ షాఫయి, "అయ్యా, నేను ఇంటి నుండి బయలుదేరింది డబ్బు సంపాదించడానికి కాదు. నేను ధార్మిక విద్య నభ్యసించి గొప్ప ఆలిమ్‌గా తయారై తిరిగివెళ్ళాలని, తరువాత దైవ ధర్మాన్ని వ్యాప్తి చెయ్యాలనే ఉద్దేశ్యంతో మాత్రమే నేను నా తల్లి నుండి దూరమైంది- అటువంటి నేను ఇంత డబ్బు తీసుకుని ఏం చేసేది?" అని అన్నారు.

"దీన్ని ఓ సోదరుని తరఫు నుండి కానుకగా భావించండి. సుదూర ప్రయాణం, దారిలో పనికొస్తాయి, తీసుకోండి" అని బలవంతపెట్టారు ఇమామ్ ముహమ్మద్. చివరికి ఇమామ్ షాఫయికి దాన్ని తీసుకోక తప్పిందికాదు. అక్కణ్ణుండి బయలుదేరి మార్గంలో ఎన్నో పట్టణాలు దర్శిస్తూ ప్రయాణం సాగించారు. ఎక్కడయినా ఓ ఆలిమ్ ఉన్నారని తెలిస్తే అక్కడికల్లా వెళ్ళి వారి వద్ద తన జ్ఞానాభివృద్ధి గావించుకునేవారు. ఆ సమయంలో వారి వయస్సు 21 సంవత్సరాలు మాత్రమే.

ఇలా తిరిగి, తిరిగి చివరికి వారు బగ్దాద్ చేరుకున్నారు. ఆ రోజుల్లో అక్కడ హారూన్ రషీద్ రాజుగా ఉన్నాడు. అతనికెలాగో తెలిసిపోయింది - ఖురైష్ వంశానికి చెందిన ఓ గొప్ప ఆలిమ్ అయిన నవ యువకుడు బగ్దాద్‌కు వస్తున్నాడని. వీరు బగ్దాద్ పట్టణ ముఖద్వారం వద్దకు చేరుకున్నాక ఓ సిపాయి వీరిని ఆపి, తన పేరు, తండ్రి పేరు, ఇంకా వంశం పేరు కూడా అడిగాడు. ఇమామ్ షాఫయి తన పూర్తి చిరునామాను అతనికి తెలియజేశారు. ఆ సిపాయి ఆ వివరాల్ని ఓ పుస్తకంలో వ్రాసుకుని వెళ్ళిపోయాడు. ఇమామ్ సాహెబ్ అక్కడి నుండి బయలుదేరి జామా (అన్ని సౌకర్యాలుగల పెద్ద) మస్జిద్‌కు చేరుకుని మస్జిద్‌లో ఓ మూలన నిద్రపోయారు. అర్ధరాత్రి సిపాయిలు వచ్చి మస్జిద్‌ని తనిఖీ చేశారు. లోపల ఉన్నవారంతా ఒక్కసారిగా గాభరాపడ్డారు. వచ్చిన సిపాయిలు ప్రతి మనిషిని వెలుతురులోకి తీసుకువచ్చి తనిఖీ చేయ

సాగారు. ఇమామ్ షాఫయీని కూడా తనిఖీ చేసి, "ఎవరికోసమయితే మేము వెదుకుతున్నామో ఆ వ్యక్తి దొరికిపోయాడు, ఇంకెవరూ కంగారుపడకండి" అని సిపాయిలు అన్నారు.

సిపాయిలు తనను ఎందుకు పట్టుకున్నారూ? అని ఇమామ్ షాఫయి ఆలోచనలో పడ్డారు. అంతలో సిపాయిలు, "పదండి, హారూన్ రషీద్ వద్దకు" అంటూ వీరిని తీసుకెళ్ళి రాజదర్బారులో హాజరుపర్చారు. హారూన్ రషీద్ అట్టహాసంతో అమర్చబడిన సింహాసనంపై కూర్చుని ఉన్నాడు. ఏ మాత్రం భయపడకుండా ఇమామ్ షాఫయి అతని దగ్గర కెళ్ళి, "అస్సలాము అలైకుమ్" అని అన్నారు.

హారూన్ రషీద్ ప్రతి సలామ్ చేసి వీరిని తన వద్ద కూర్చోబెట్టుకుని, పేరు, ఊరూ అడిగాడు. జవాబుగా ఇమామ్ సాహెబ్, "నేను మక్కా నివాసిని, ఖురైష్ తెగలోని హాష్మీ వంశానికి చెందినవాణ్ణి" అని అన్నారు. హారూన్ రషీద్ కూడా అదే తెగ, అదే వంశానికి చెందినవాడు. ఇక ఇద్దరి మధ్య సంభాషణ మొదలయ్యింది. ఇమామ్ సాహెబ్ విద్యాపాటవాన్ని గ్రహించిన అతను ఆశ్చర్యంలో మునిగిపోయి, "నేను మిమ్మల్ని ఖాజీ (న్యాయమూర్తి)గా నియమించదలిచాను. మీరు అంగీకరించండ"ని అన్నాడు. ఇమామ్ షాఫయి అందుకు తన అసమ్మతిని తెలియజేస్తూ మనసులో, "ఈ రాజు నన్ను తన అధీనంలో ఉంచుకోదల్చుకున్నాడు, ఎలాగైనా ఇక్కణ్ణుండి త్వరగా బయటపడే మార్గం ఏదయినా తోచితే బావుండు" అనే ఆలోచనలో పడ్డారు. దీనిపై హారూన్ రషీద్, "మంచిది, దీనికన్నా మిన్న ఇంకేమయినా కోరిక ఉంటే తెలుపండ"ని అన్నాడు. సమాధానంగా, "అతి త్వరలో ఈ బగ్దాదు నగరం నుండి బయటపడాలని ఉంద"ని అన్నారు ఇమామ్ సాహెబ్.

సమాధానం విని హారూన్ రషీద్ ఎంతో బాధపడ్డాడు. తరువాత ఓ వెయ్యి దీనార్లను సమర్పించుకుంటూ, "ఎవరయినా ఉత్తములు నాతో కలవడానికి వస్తే వారికి ఈ విధంగా కానుకలు ఇచ్చుకోవడం నా సంప్రదాయం"

అని అన్నాడు. ఆ డబ్బు సంచిని తీసుకుని ఇమామ్ సాహెబ్ బయటి ద్వారం వద్దకు వచ్చారో లేదో, సిపాయిలంతా చుట్టుముట్టి వారికి కూడా అందులో భాగం కావాలని అన్నారు. ఇమామ్ సాహెబ్ సిపాయిలందర్నీ పిలిచి దీనార్లను పది భాగాలు చేశారు. ఒక భాగం తను అట్టిపెట్టుకుని తతిమ్మావి వారికి సమానంగా పంచేసి అక్కణ్ణుండి బయటపడ్డారు. మళ్ళీ జామా మస్జిద్‌లోకి వెళ్ళి కూర్చున్నారు. నమాజ్ వేళ అవగా ఓ యువకుడు నమాజ్ చేయించాడు. అందులో అతను కొన్ని పొరపాట్లు చేశాడు. అందులో ఒకటి, సజ్దా సహూ (మన్నింపుకై సజ్దా) చేయవలసి వున్న పొరపాటు. కాని అతను సజ్దా సహూ చేయలేదు. ఈ విషయంపై ఇమామ్ సాహెబ్ అతన్ని వారించగా, తిరిగి అతను నమాజ్ చేయించాడు.

నమాజ్ ముగిసిన తరువాత ఇమామ్ సాహెబ్ ఆ యువకునితో, "కలం, కాగితం తీసుకురండి, నేను మీకు నమాజ్ చేసే పద్ధతిని తెలియజేస్తాన"ని అన్నారు. ఆ యువకుడు అలాగే కలం, కాగితం తీసుకువచ్చాడు. ఇక ఇమామ్ సాహెబ్ ఆది నుండి అంతం వరకు నమాజ్ పద్ధతి, అందులోని సమస్యలన్నింటినీ తెలియజేసి అతనిచేత వ్రాయించారు. అది ఓ మోస్తరుగా ఓ పుస్తకమే అయింది. ఆ యువకుని పేరు జాఫ్రాన్. ఇమామ్ సాహెబ్ అతని పేరనే ఆ పుస్తకానికి "కితాబె జాఫ్రాన్" అని పేరుబెట్టారు.

ఇమామ్ షాఫయి బగ్దాద్‌లో మూడు సంవత్సరాలు గడిపారు. హారూన్ రషీద్ ఎలాగోలా వీరిని బగ్దాద్ తహసిల్దారుగా ఉండటానికి ఒప్పించగలిగాడు. కాని వారు అతి కొద్దికాలంలోనే ఆ పదవిని త్యజించారు. తరువాత కొంత కాలానికి ప్రజలు హజ్ యాత్రకై బయలుదేరగా వీరికి 'కూఫా', అక్కడ ఉన్న ఇమామ్ అబూ యూసుఫ్, ముహమ్మద్ బిన్ హసన్, ఇమామ్ మాలిక్ తదితర పెద్దలు గుర్తుకు వచ్చారు. అంతకంటే ఎక్కువగా తల్లిగారి జ్ఞాపకం వీరిని వేధించింది. ఇంకేముంది ఇమామ్ సాహెబ్ హారూన్ రషీద్‌కు తన రాజీనామాను పంపించి బిడారుతోపాటు మక్కా దిశగా పయనమయ్యారు. బిడారులోని ఓ

వ్యక్తి ద్వారా, "ఇమామ్ మాలిక్ పెద్ద ధనవంతులయ్యారని, డాబు దర్పంతో ఓ మహల్‌లో ఉంటున్నారని" ఇమామ్ షాఫయి విని, "కనీసం వెళ్ళి చూద్దాం, అంతటి ఐశ్వర్యంలో వారి దైవభక్తి ఎలాగుందో" అని అనుకున్నారు.

మార్గమధ్యంలో ఓ వ్యక్తి ఇమామ్ సాహెబ్‌ని గుర్తించి, వారి ఖర్చులకుగాను - ఇమామ్ సాహెబ్ ఎంత వద్దని చెప్పినా- కొంత డబ్బును బలవంతంగా ఇచ్చాడు. బిడారు వెంట ప్రయాణించి "హిరాన్" అనే ప్రదేశానికి చేరారు. ఆ రోజు శుక్రవారం, ప్రవక్త (స) సున్నత్ కాబట్టి శిరోముండనం చేయించుకుని తల స్నానం చేయాలని అనుకుంటూ ఇమామ్ సాహెబ్ మంగలి దగ్గరికి వెళ్ళి శిరోముండనం చేయమని అన్నారు. సగం తల గొరిగిన తరువాత, అంతలో ఓ ధనికుడు వచ్చాడు. ఆ మంగలి ఇమామ్ సాహెబ్‌ని సగంలోనే వదలిపెట్టి, ఆ వచ్చిన ధనకునికి క్షవరం చేయడం మొదలెట్టాడు. ఈ విషయం ఇమామ్ సాహెబ్‌కు ఎంతో కోపాన్ని కల్గించింది. భయం, డబ్బు లాలూచీతోనే మంగలి ఈ పని చేశాడని అనుకున్నారు ఇమామ్ సాహెబ్. మళ్ళీ ఆ మంగలి ఇమామ్ సాహెబ్ వద్దకు రాగా వారు అతన్ని వారించి, "డబ్బు ఆశతో ఓ దైవదాసుని పట్ల ఇంత నీచంగా ప్రవర్తిస్తావా, సరే మంచిది, ఇదిగో నీ డబ్బు తీసుకో" అని అంటూ కొంత సొమ్మును ఇచ్చారు.

ఈ వ్యవహారాన్నంతా గమనిస్తున్న కొంత మంది ఇమామ్ సాహెబ్‌తో, "ఇది బాగానే ఉందండి, వాడు మీతో అంత అమర్యాదగా ప్రవర్తించినా మీరు అతనికి డబ్బిచ్చారేంటి, మీ పిచ్చికాకపోతే" అని అన్నారు. తరువాత ఇమామ్ సాహెబ్ స్నానం ముగించుకుని బయటికి వచ్చారు. వారిని చూసి, అటుగుండా వెళ్తున్న ఓ ధనికుడు గుర్రం దిగి కౌగిలించుకున్నాడు.

మీరెవరని ఇమామ్ సాహెబ్ అడిగారు. సమాధానంగా అతను, "నేనైతే మిమ్మల్ని గుర్తుపట్టాను, మీరు ఇమామ్ షాఫయి అని." తరువాత అతను, "మీరు నాతో రండి" అని ఇమామ్ సాహెబ్‌తో అనగా, అలాగే వారు అతని వెంట నడిచారు. అతను వారిని ఆ పట్టణంలోని గొప్ప ఐశ్వర్యవంతుని ఇంటికి

తీసుకెళ్ళాడు. ఆ ధనికుడు వీరిని ఎంతో మర్యాదచేసి కూర్చోబెట్టి భోజన ఏర్పాటు చేశాడు. దీన్ని గ్రహించిన ఇమామ్ సాహెబ్, "అసలు మీరెవరో, నన్నెలా గుర్తుపట్టారో తెలియజేయనంతవరకు నేను అన్నమే ముట్టను" అని అన్నారు.

సమాధానంగా ఆ యువకుడు, "బగ్దాదులో ఉన్నప్పుడు మీరు ఓ పుస్తకం వ్రాసి దాన్ని ప్రజలకు విన్పించారు. ఆ సమయంలో మేము కూడా మీ ఉపన్యాస పాఠాన్ని విన్నాము. మేము మీ శిష్యులమే" అన్నాడు. తరువాత ఇమామ్ సాహెబ్ వారిద్దర్నీ కౌగిలించుకున్నారు. ఆపై మూడు రోజులు హిరాన్‌లో గడిపాక, ధనికుడు ఇలా అన్నాడు, "అయ్యా! నా అధీనంలో నాలుగు గ్రామాలున్నాయి. వీటి వలన చాలా ఆదాయం వస్తుంది. నేను మీతో కోరేదేమంటే - ఆ నాల్గు గ్రామాల్ని మీరు స్వీకరిస్తే బావుంటుంది." ఇమామ్ సాహెబ్ అందుకు నిరాకరించగా, ఆ ధనికుడు దీనార్లతో నిండిన నలభై సంచుల్ని తీసుకొచ్చి ఇమామ్ సాహెబ్ ముందుంచుతూ, "సరే, మీరు వెళ్ళేటట్లయితే కనీసం ఈ డబ్బునయినా స్వీకరించండి" అని బలవంతం పెట్టాడు. ఇక వాటిని తీసుకోవడం తప్పింది కాదు ఇమామ్ సాహెబ్‌కు.

దైవ సృష్టి ఎంతో విచిత్రమయింది. ఎవరయితే డబ్బుకు ఆశపడడో అతనికి దారి పొడుగూతా డబ్బు దొరుకుతుంది. మరెవరయితే దానివెంట పడ్డాడో అతనికి ఆమడ దూరంగా పరుగెడుతుందది, ప్రపంచంలో అతన్ని అవమానాలపాల్జేస్తుంది. ఇమామ్ షాఫయి (రహ్మాలై) విషయాలు చదువుతుంటే ఈ విషయమే తేటతెల్లమవుతుంది.

హిరాన్ నుండి బయలుదేరిన ఇమామ్ సాహెబ్ దారిలో కలిసిన ప్రతి ఆలిమ్‌కు, నిరుపేదలకు ఎంతో డబ్బును విచ్చలవిడిగా పంచేశారు. ఇలా వెళ్తూ వెళ్తూ రమ్‌లా పట్టణం చేరేసరికి వారి వద్ద కేవలం పది దీనార్లే మిగిలాయి. రమ్‌లాలో ఓ సవారీని అద్దెకు తీసుకుని తన గురువుగారయిన హజ్రత్ ఇమామ్ మాలిక్ (రహ్మాలై)ని కలుసుకోవడానికి మదీనాకు బయలుదేరారు. మదీనా

చేరుకున్నాక మస్జిదె నబవిలోకి ప్రవేశించారు. అక్కడే అసర్ నమాజ్ చేశారు. అంతలో ఇమామ్ మాలిక్ ఎంతో అట్టహాసంతో రావడం చూశారు. వారి వెంట నాల్గు వందల మంది పండితులున్నారు. నలుగురు వ్యక్తులు వారి అంగీ (జుబ్బా) నాలుగంచులు పట్టుకున్నారు. వారు ఓ ఎత్తయిన కుర్చీలో కూర్చుని అందర్నీ ఉద్దేశించి ఓ ప్రశ్న అడిగారు. ఎవ్వరూ దానికి సమాధానం చెప్పలేకపోయారు. ఇమామ్ షాఫయి చెంత ఓ వ్యక్తి కూర్చుని ఉన్నాడు. వారు ఆ ప్రశ్నకు సమాధానం చెప్పారు ఆ వ్యక్తికి. ఆ వ్యక్తి లేచి ఆ సమాధానాన్ని చెప్పేశాడు. ఇమామ్ మాలిక్, "ఇదే సరియైన సమాధానం, మీరంతా దీన్ని వ్రాసుకోండి" అని అన్నారు.

తరువాత ఇమామ్ మాలిక్ రెండో ప్రశ్న వేశారు. మళ్ళీ ఇమామ్ షాఫయి ఆ వ్యక్తికే దీనికి సరియైన సమాధానాన్ని చెప్పేశారు. ఇలా ఇమామ్ మాలిక్ అడిగిన ప్రశ్నకల్లా సమాధానం కొరకు ఆ వ్యక్తి ఇమామ్ షాఫయి వంక చూడటం, ఆ తరువాత దానికి జవాబు చెప్పడం జరిగింది. ఇమామ్ మాలిక్ ఆ వ్యక్తి పట్ల ఎంతో సంతోషాన్ని వెలిబుచ్చారు. అతన్ని తన వద్దకు పలిపించి, 'నీవు ఏ గురువు వద్ద చదువు నేర్చుకున్నావ'ని అడిగారు. సమాధానంగా అతను, "అయ్యా! నేను చదువురానివాణ్ణి, అదిగో అక్కడ నా చెంత ఓ యువకుడు కూర్చుని ఉన్నాడు. అతనే మీ ప్రశ్నలకు జవాబు చెబుతున్నాడు, దాన్ని విని నేను మీకు విన్పిస్తున్నాను" అన్నాడు. తరువాత ఇమామ్ మాలిక్, ఇమామ్ షాఫయిని తన వద్దకు పిలిపించుకుని కొంత తడవు చూశాక వారిని గుర్తుపట్టి "మీరు ముహమ్మద్ బిన్ ఇద్రీస్ షాఫయి కదూ" అని అడిగారు ఇమామ్ మాలిక్. "అవును, నేను మీ పాత శిష్యుణ్ణే" అని సమాధానమిచ్చారు ఇమామ్ షాఫయి. ఆపై ఇమామ్ మాలిక్ వారిని కౌగిలించుకుని తన కుర్చీ నుండి దిగి, "మీరు ఈ కుర్చీపై కూర్చుని నేనడిగిన సమస్యలన్నింటికీ సమాధానం చెప్పండి" అని అన్నారు. గురువు గారి ఆజ్ఞానుసారం ఇమామ్ షాఫయి ఆ రోజు బోధనను పూర్తి చేశారు. ఇమామ్ మాలిక్ సంతోషంతో వారి వీపు తట్టి శభాష్! అంటూ దుఆ చేశారు.

మగ్‌రిబ్ నమాజ్ తరువాత తన శిష్యుణ్ణి తన ఇంటికి తీసుకెళ్ళారు. ఇమామ్ మాలిక్ గారి వైభవోపేతమైన మహల్‌ను చూసి ఇమామ్ షాఫయి కన్నీరు కార్చారు. వీరి మనోవేదనపై ఇమామ్ మాలిక్ కూడా చిన్నబోయారు. అయినా సంబాళించుకుని, "షాఫయి! మీరెందుకిలా దుఃఖిస్తున్నారు? నేను ఇదంతా ప్రపంచ వ్యామోహంతో కూడబెట్టి, పరలోకాన్ని మరచిపోయానని భావిస్తున్నారా మీరు?" అని అడిగారు.

దీనికి ఇమామ్ షాఫయి, "అవును, నాకదే అనుమానం, భయంగా ఉంది" అని అన్నారు.

"మీ ముందున్న ఈ సంపదంతా ధర్మసంపాదన మాత్రమే సుమా! నేను ప్రతి సంవత్సరం దీనిపై జకాత్ చెల్లిస్తాను. సుదూర ప్రాంతాల నుండి విద్యాభిలాషులు నా వద్దకు ఎన్నో కానుకలు పంపిస్తూ ఉంటారు. దైవప్రవక్త (స) కానుకల్ని నిరాకరించవద్దని చెప్పారు కదా! అందుకని నేను వాటిని వాపసు పంపలేను" అంటూ కానుకలన్నింటినీ చూపించారు ఇమామ్ మాలిక్. వాటిలో రకరకాల వస్త్రాలు, గుర్రాలు, కంచర గాడిదలు, ఇతర సామాన్లు ఇంకా వేల కొలది దీనార్‌లున్నాయి. "ఇందులో సగభాగం మీది" అని ఓ కాగితంపై ఒప్పందంలా వ్రాసి దాన్ని ఇమామ్ షాఫయికి ఇచ్చారు ఇమామ్ మాలిక్.

ఇమామ్ షాఫయి తన గురువుగారి వద్ద మూడు రోజులుండి నాలుగవ రోజు మక్కాకు పయనమయ్యారు. గుర్రాలు, కంచర గాడిదలు, వస్త్రాలు, దిర్హమ్‌లు, దీనార్‌లు వెంటవున్నాయి. ఇమామ్ షాఫయి ఇంటి నుండి బయలుదేరినప్పుడు వారి వద్ద రెండు దుప్పట్లు తప్ప ఏమీ లేవు. అయితే ఇప్పుడు ఎంతో అట్టహాసంతో మక్కాకు వస్తున్నారు. తల్లికి ముందుగానే ఉత్తరం వ్రాశారు. కాబట్టి వీరి రాకకై ఎదురుచూస్తున్నారు ఆమె. ప్రతి రోజు తన పినతల్లి సోదరీలను వెంట తీసుకుని వీరి రాకకై ఎదురుచూస్తుండేవారు.

ఈ సామానుతో ఇమామ్ షాఫయి మక్కా శివార్లలోకి ప్రవేశించారు. అక్కడే వీరి తల్లి కలిసి తనయుణ్ణి హృదయానికి హత్తుకున్నారు. వీరి రాకతో ఆమె ఎంతో సంతోషించారు కాని, కొద్ది సేపట్లోనే మనసు చిన్నబుచ్చుకున్నారు. ఇమామ్ షాఫయి కారణం అడిగారు. ఆమె సమాధానంగా, "కుమారా! నేను నిన్ను జ్ఞానసముపార్జనకు పంపిస్తే, ఈ సంపదను వెంట తీసుకొచ్చావేంటి?" అన్నారు.

అప్పుడు ఇమామ్ షాఫయి తన ప్రయాణంలో జరిగిన వృత్తాంతాన్ని విన్పించి ఇదంతా ఇమామ్ మాలిక్ ఇచ్చారని చెప్పారు. దానిపై ఆమె "కుమారా! సంపద వలన అహంకారం పుడుతుంది. దీనిపై వ్యామోహంతో నీవు నీ బాబాయి కొడుకులపై ఆధిక్యత ప్రదర్శించి వారిని హీనంగా చూడదల్చుకున్నావా?" అని అన్నారు.

"అమ్మా! అయితే ఇప్పుడేం చేయమంటావో సెలవివ్వు" అని ఇమామ్ షాఫయి అడిగారు.

"దీన్నంతా దైవ మార్గంలో ఖర్చుపెట్టి దైవ గృహం (కాబా)లో ఓ ఫకీరులా ఉండు" అని సమాధానమిచ్చారు తల్లి.

ఇక చూడండి! ఇమామ్ షాఫయి దండోరా వేయించారు- ఆకలితో ఉన్నవారు ధాన్యాన్ని తీసుకెళ్ళండి, బట్టలు లేనివారు బట్టలు, నిరుపేదలు వచ్చి దీనార్‌లు దిర్హమ్‌లు - మొత్తం మీద ఎవరికేది అవసరమో దాన్ని తీసుకెళ్ళమని ప్రకటించారు.

చూస్తుండగానే మొత్తం సంపద దానంగా పంచబడింది. చివరికి ఓ కంచర గాడిద, యాభై దీనార్‌లు మాత్రమే మిగిలాయి. వాటి కోసం ఎవరూ రాలేదు. అప్పుడుగాని వారు మక్కాలో ప్రవేశించలేదు. ఉన్నట్టుండి కొరడా చేతి నుండి జారి క్రిందపడింది. అదే సమయంలో నీళ్ళు తీసుకువెళ్తున్న ఓ యువతి ఆ కొరడాను ఇమామ్ సాహెబ్ చేతికి అందజేసింది. ఆ తరువాత

ఇమామ్ సాహెబ్ ఆమెకు ఐదు దీనార్‌లు బహుమతిగా ఇచ్చారు. దీనిపై వారి తల్లి అన్నారు - "నీ వద్ద ఐదు దీనార్లే ఉన్నాయా?" అని. "లేదమ్మా, నా వద్ద నిజంగా యాభై దీనార్లున్నాయి. ఐదు దీనార్లు పోగా, మిగతావి ఇంటి ఖర్చులకయినా పనికొస్తాయని ఉంచాను" అని ఇమామ్ సాహెబ్ అన్నారు.

"ఒరె నాయనా! ఆ దీనార్లపై ఎందుకంత భరోసా నీకు. అన్నీ ఇచ్చేవాడు పైన ఉన్నాడు కదా! అతనిపై భరోసా ఉంచి మిగతావి కూడా ఆ అమ్మాయికి ఇచ్చేయి" అన్నారు వారి తల్లి.

ఇమామ్ సాహెబ్ తతిమ్మా దీనార్‌లను కూడా ఆ యువతికిచ్చి వట్టి చేతులతోనే ఇంటికి చేరుకున్నారు. ఇమామ్ షాఫయి విషయం, వారి తల్లిగారి విషయం తెలుసుకుని ఇమామ్ మాలిక్ వీరికి శుభాకాంక్షలు తెలుపుతూ - "మీరు ధర్మ విద్యా వ్యాప్తికై పాటుపడండి. నేను మీకిప్పుడు ఇచ్చి పంపుతున్న దాన్ని ప్రతి సంవత్సరం పంపే ఏర్పాటు చేస్తాను, ఇన్షా అల్లాహ్" అని చెప్పి పంపారు.

ఈ సంఘటన తరువాత ఇమామ్ మాలిక్ పదకొండు సంవత్సరాలు జీవించి ఉన్నారు. ప్రతి సంవత్సరం మాట ప్రకారం సంపదను పంపుతూ వచ్చారు. ఇమామ్ మాలిక్ గారి మరణానంతరం భృతికై ఇమామ్ షాఫయికి కొంచెం గడ్డు పరిస్థితి ఏర్పడి మక్కా నుండి యమన్‌కు చేరుకున్నారు. అక్కడ ప్రజలకు హదీసు పాఠాన్ని, ధర్మవిద్యను బోధిస్తూనే వ్యాపారం చేయసాగారు. వీరు యమన్‌లో ఉన్నప్పుడే హారూన్ రషీద్ వీరిని బగ్దాద్‌కు పిలిపించాడు. రెండు సంవత్సరాలు అక్కడ గడిపారు. తరువాత అక్కణ్ణుండి బయలుదేరి ఎన్నో పట్టణాలు తిరుగుతూ చివరికి "ఫస్తాత్" అనే ప్రదేశంలో ఓ పాఠశాలను స్థాపించి అక్కడ తన బోధనను మొదలెట్టారు.

వీరి శిష్యుల్లో అనేక మంది గొప్ప ఇమామ్‌లుగా తయారయ్యారు. అయితే వీరందరిలో ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రహ్మలై) అందరికంటే

ప్రసిద్ధిచెందారు. ఇమామ్ షాఫయి (రహ్మలై) 52 సంవత్సరాలు జీవించారు. జీవితాంతం ప్రజలకు ధార్మిక విద్యను బోధించారు. కొద్దిపాటి వ్యాపారం చేస్తూ అందులో వచ్చిన కొద్ది లాభంతోనే సంతృప్తిచెందేవారు. ఈ విధంగా కాలం గడుపుతూ హిజ్రీ శకం 204లో దైవ సాన్నిధ్యానికి చేరుకున్నారు. వీరి సతీమణి పేరు ఉమ్దా. వీరు హజ్రత్ ఉస్మాన్ గని (రజి) పెద్ద మనుమరాలు. వీరు కూడా గొప్ప పండితురాలు, విద్యలో ఎంతో ప్రావీణ్యతగలవారు.

## ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రహ్మలై)

ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రహ్మలై), ఇమామ్ షాఫయి (రహ్మలై) గారి శిష్యులందరిలో శ్రేష్టులుగా ప్రసిద్ధిగాంచారు. ఆ కాలంలో వీరు ఖుర్ఆన్, హదీసుల్లో అందరికన్నా మిన్నయైన ఇమామ్‌గా పరిగణించబడేవారు. స్వయంగా ఇమామ్ షాఫయి (రహ్మలై) ఆయన్ని ప్రస్తావిస్తూ, "బగ్దాద్‌లో అహ్మద్ బిన్ హంబల్ కంటే మిన్నయైన ఆలిమ్‌ని నేను చూడలేదు" అని అన్నారు. ఇమామ్ అహ్మద్ తమ గురువుగారి సూచనల ననుసరించి అనేక సమస్యలకు సమాధానాలిస్తూ వాటిలో అక్కడక్కడ తమ స్వంత అభిప్రాయాల్ని కూడా జోడించేవారు. ఈ విధంగా వీరు కూడా ఓ ఫిఖా (ధర్మశాస్త్రం)ను ఉనికిలోకి తెచ్చారు. అరేబియా దేశంలో నేటికీ చాలా మంది వీరి ఫిఖాను అనుసరిస్తున్నారు.

వీరు హిజ్రీ శకం 164లో బగ్దాద్‌లో జన్మించారు. వీరి తండ్రి పేరు ముహమ్మద్, తాత పేరు హంబల్. తాతగారి పేరనే వీరు ప్రసిద్ధి చెందడం వలన వీరి పేరు అహ్మద్ బిన్ ముహమ్మద్‌కు బదులు అహ్మద్ బిన్ హంబల్ అయింది. ఇదే పేరున వీరి ఫిఖా "ఫిఖయె హంబలీ"గా ప్రఖ్యాతిగాంచింది. వీరు హిజ్రీ 241లో అంటే 77 సంవత్సరాల వయస్సులో దైవ సన్నిధికి చేరుకున్నారు.

వీరు బాల్యంలో ఉన్నప్పుడే వీరి తండ్రిగారు పరమపదించారు. తండ్రిగారు పరలోకానికేగిన సమయంలో కొన్ని దుకాణాలు ఉండేవి. వాటిపై అద్దె బాపతు ప్రతి నెలా 17 దిర్హమ్‌లు వచ్చేవి. ఈ కొద్దిపాటి ఆదాయంతోనే తల్లి వీరిని పెంచి పోషించడమేగాక, విద్యాభ్యాసం కూడా గావించారు. వీరి తల్లి ఎంతో దైవభక్తిపరాయణురాలు. ఆమె తన తనయునిలో విద్యాభిలాషను నూరిపోసేవారు. ముందుగా వీరిని "ఖుర్‌ఆన్ హాఫిజ్"గా తయారుచేశారు. 7 సంవత్సరాల వయస్సులోనే వీరు పూర్తి ఖుర్‌ఆన్‌ని కంఠస్థం చేశారు. ఆ తరువాత చదవడం, వ్రాయడం నేర్చారు.

వీరు బాల్య దశలోనే చదవడం, వ్రాయడం నేర్చుకోవడం వలన పరదాలో ఉండే స్త్రీలకు ఎంతో ఉపయోగపడ్డారు. ఎందుకంటే చాలా మంది భర్తలు సిపాయిలుగా ఉండేవారు ఆ రోజుల్లో. అందువలన ఆ స్త్రీలు వీరిని ఇంటికి రప్పించుకుని వీరిచేత ఉత్తరాలు వ్రాయించేవారు. ఆ స్త్రీల రహస్యాలుగాని, మాటలుగాని ఎవరితోనూ ప్రస్తావించేవారు కాదు ఇమామ్ సాహెబ్. దీని వలన అందరూ వీరిని ఎంతో గౌరవించేవారు. ఒకరి రహస్యాలను బయటపెట్టడాన్ని ఎంతో చెడుగా భావించేవారు వీరు.

ఇమామ్ సాహెబ్ బంధువుల్లో ఒకరు బగ్దాద్‌లో గూఢచారిగా పనిచేసేవారు. వీరు పగలంతా వార్తలు సేకరించి వాటిని గూఢచార విభాగ అధికారికి చేరవేస్తుంటారు. ఒకసారి ఏదో కారణాన అతను వెళ్ళలేక వరుసకు అన్న కొడుకైన ఈ ఇమామ్ సాహెబ్‌ను పిలిచి, "ఈ సమాచార భోగట్టాను ఆఫీసరుగారికి ఇచ్చిరమ్మ"ని పంపించారు. మహనీయులు, దైవజ్ఞులయిన గొప్ప పండితులను గురించి కూడా గూఢచార శాఖకు సమాచారం అందించబడేది. ఆ రోజుల్లో ఇలాంటి ఇమామ్‌లు ఖలీఫాల చెడు పనుల్ని ప్రజలకు తెలియజేసి, వాటి నిర్మూలనకై సలహాలనిచ్చేవారు, హితబోధ కూడా చేసేవారు. ఇలాంటి వారి కారణంగానే ఖలీఫా ప్రతి సమయంలోనూ జాగ్రత్తగా, మెలకువతో వ్యవహరించేవాడు. మొత్తం మీద గూఢచార విభాగం ఆఫీసర్‌కు

చేరవేయమని తనకిచ్చిన ఆ సమాచార పత్రాల్ని ఇమామ్ సాహెబ్ మార్గ మధ్యంలో ఓ నదిలో పడవేసి వచ్చారు. ఆ రోజు వార్తలు ఆఫీసరుకు అందక పోయేసరికి, అతను ఆ గూఢచారిని పిలిచి అడిగాడు. తరువాత ఆ గూఢచారి ఈ విషయమై ఇమామ్ సాహెబ్‌ని విచారించగా, వారు నిర్మొహమాటంగా, "నేను ఆ రహస్య పత్రాలను నదిలో పారేశాను" అని చెప్పారు. కారణం అడగ్గా, "మంచి వారిని గురించి విప్పిచెప్పడం అల్లాహ్‌కు ఇష్టం లేదు" అని అన్నారు. ఈ విషయాన్నే ఆ గూఢచారి తన పైఅధికారికి వ్రాసి పంపాడు. ఆ ఉన్నతాధికారి కూడా ఇమామ్ సాహెబ్‌ని పిలిచి వాకబు చేయగా, అతని ముందు కూడా ఈ విషయాన్నే చెప్పేశారు. వీరి పిన్న వయసును చూసి ఆ ఆఫీసరు కూడా ఏమీ అనలేకపోయాడు. అయితే వీరిలో ఈ అలవాట్లు చూసినవారెల్లా, "ఈ పిల్లవాడే బ్రతికి బాగుంటే, మున్ముందు తన కాలంలో తార్కికుడు అవుతాడు" అని అనేవారు. అంటే ఏ విషయాన్నయినా ఖుర్‌ఆన్, సున్నత్‌ల వెలుగులో పరిష్కరిస్తాడని అర్థం.

వీరి చిన్నతనంలో బగ్దాద్‌లో గొప్ప ఆలిమ్‌లుండేవారు. ఏడేళ్ళ ప్రాయం లోనే ఖుర్‌ఆన్, సున్నత్‌ల జ్ఞానాన్ని అభ్యసించిన వీరు, మొదట ఇమామ్ అబూ యూసుఫ్‌గారి బోధనా తరగతులకు హాజరయ్యారు. బగ్దాద్‌లో ఉన్న ఇమామ్‌ల వద్ద అభ్యసించిన విద్యతో సంతృప్తిచెందక వీరు విద్యాభిలాషతో దూర ప్రాంతాలకు వెళ్ళేవారు. ఎక్కడయినా ఓ ఆలిమ్ ఉన్నారని తెలిస్తే చాలు, అక్కడికి వెళ్ళి వారివద్ద విద్య నేర్చుకునేవారు. హిజ్రీ 186లో బస్రా, కూఫా, మదీనా, సిరియా, హజాజ్ ఇంకా యమన్‌లకు కూడా వెళ్ళారు. అదే సంవత్సరం ఇమామ్ షాఫయితో కలిసి వారి బోధనను విన్నారు. అందరికంటే వీరిపై ఇమామ్ షాఫయిగారి ప్రభావం ఎక్కువగా పడింది. కాబట్టే ఇమామ్ సాహెబ్ వారికెంతో సేవ చేసేవారు. బాల్యం నుంచే ఇమామ్ సాహెబ్‌లో ఉన్న మంచి లక్షణం ఏమిటంటే ఎంత అవసరం ఉన్నా సరే, ఎవరయినా ఉచితంగా డబ్బు ఇస్తానంటే ససేమిరా తీసుకునే వారు కాదు. కూలినాలి

చేసేవారు. బట్టలు నేయడం కూడా వచ్చు. సమయం దొరికితే చాలు, బట్టలు నేసి సంపాదించిన పైకంతోనే కాలం వెళ్ళదీసేవారు. వీరు ఫార్సీ భాష కూడా నేర్చుకున్నారు. బగ్దాద్ వదలి ఇతర పట్టణాలకు పయనమైనప్పుడు వీరి విద్యా యశస్సు అందరికీ తెలిసిపోయింది. పెద్దపెద్ద ఇమామ్‌ల వద్ద విద్య నేర్చుకున్నట్లే, వీరు గొప్ప శిష్యులను కూడా తయారుచేసి మరీ వెళ్ళారు. హదీసు విద్యలో అందరికంటే మిన్నయైన హజ్రత్ ఇమామ్ బుఖారి (రహ్మాలై) వీరి శిష్యులే. చివరికి ఇమామ్ సాహెబ్ బగ్దాద్‌కే చేరుకుని అంతిమ శ్వాస వరకు అక్కడే ఉండి హదీసు, ఫిఖాలను బోధిస్తూ ధర్మవ్యాప్తి చేశారు.

## త్యాగమయ జీవితం

ఖుర్‌ఆన్, హదీసుల్లో చదివిన ప్రకారంగానే ఆచరణ కూడా చేసేవారు ఇమామ్ సాహెబ్. ఏ ఒక్క పనీ దైవానికి, దైవ ప్రవక్త (స)కు వ్యతిరేకంగా చేసేవారు కాదు. ఈ ఆచరణాక్రమంలో వారు ఓ కఠిన పరీక్షకు గురై, దైవకృప వలన అందులో నెగ్గుకు వచ్చారు. ఆ కాలంలో ఉన్న రాజును ప్రజలు తప్పుదోవ పట్టించారు. ఖుర్‌ఆన్ విషయంలో ప్రజలు ఓ ఘోర తప్పుడు భావనను అతని మనసులో నాటారు. దాని ప్రకారంగా అతను తన రాజ్య పరిధిలో ఉన్న ఆలిమ్‌లందరూ దాన్ననుసరించి నడుచుకోవాలని ఆజ్ఞాపించాడు. పైగా ఎవరైనా దీన్ని కాదంటే వారికి దేశ రాజధాని (బగ్దాద్)లోని జైల్లో వేయడమో లేక హతమార్చడమో జరుగుతుందని కూడా ఆజ్ఞాపించాడు.

ఏ ఆలిమ్‌లైతే దానికి విముఖత చూపించారో వారందరిలోకెల్లా ధార్మికంగా నిష్ఠాగరిష్టులయినవారు వీరే. ఆ రోజుల్లో వీరి అభిమానులు కూడా ఎక్కువ సంఖ్యలోనే ఉండేవారు. అందువలన ఇమామ్ సాహెబ్ అంగీకరిస్తే తతిమ్మావారంతా అంగీకరించినట్లేనని భావించాడు రాజు. అయితే, ఇమామ్ సాహెబ్ ఆ ఆజ్ఞను తిరస్కరిస్తూ ఖుర్‌ఆన్, హదీసుల ప్రకారం ఎలా సరియైనదో రుజువు చేయమన్నారు.

రాజు, అతని తరఫున ఉన్న ఆలిమ్‌లు రుజువు చేయలేకపోగా, బలవంతాన ప్రజల నోరు నొక్కేయదలిచారు. అసలు రాజులు, దేశాధినేతలు ఎక్కువ మంది ఇలాంటి మనస్తత్వం కలవారే అయివుంటారు. తమ తప్పుడు మాటను ఇతరులచేత బలవంతంగానయినా ఒప్పించే ప్రయత్నం చేస్తారు. కాని దేవుని నిజమయిన దాసులు అది రాజుగారి అజ్ఞ అయినా, ఇంకా దాని వలన ఎంత ప్రాణముప్పు ఏర్పడినా తప్పుడు భావనను అంగీకరించరు. ఇంతకుముందు ఇతర ఇమామ్‌ల గురించి మనం చదవివున్నాం. ఇమామ్ అబూ హనీఫా (రహ్మలై) కాలంలో కూడా ఆనాటి రాజు వారిని ఎన్నో కష్టాలకు గురిచేశాడు. ఇమామ్ మాలిక్ (రహ్మలై) పట్ల కూడా ఎంతో చెడుగా ప్రవర్తించాడు ఆనాటి రాజు. ఇప్పుడు ఇమామ్ హంబల్ (రహ్మలై) వంతు వచ్చింది. కాబట్టే వీరి కాలంలో ఒక్కడు కాదు, ఒకరి తరువాత మరొకరు, ఇలా అనేక మంది రాజులు వారికి శత్రువులుగా తయారయ్యారు. వీరిని జైల్లో నిర్బంధించారు. తరువాత అందరి ముందూ కొరడాతో కొట్టించారు. వాసిఖ్ అనే ఖలీఫా వీరిని అందరికన్నా మిన్నగా కష్టపెట్టాడు. ఆ ఖలీఫా వీరికి ఎలాంటి కొరడా దెబ్బలు వేయించాడంటే ఏనుగయినా సరే ఆ దెబ్బలకు పెడబొబ్బలు పెట్టేదేమో! అయితే ఇమామ్ సాహెబ్ ప్రతి కొరడా దెబ్బకు, "ఖుర్‌ఆన్, సున్నత్‌ల ప్రకారం నిరూపిస్తే ఒప్పుకుంటాను, లేకుంటే ప్రాణాలు పోయినా ఫరవాలేదు" అని అనేవారు.

ప్రతి కొరడా దెబ్బకు వారి ఒంటిపై చర్మం లేచిపోయేది. ఓ రోజు వారిపై కొరడా దెబ్బలు పడుతున్నప్పుడు మొదటి దెబ్బకు "బిస్మిల్లాహ్" అని, రెండవ దెబ్బకు "లాహౌలా వలా ఖువ్వత ఇల్లా బిల్లాహ్" (దైవం తప్ప మరే శక్తీ లేదు, మరే అధికారీ లేడు), మూడో కొరడాకు "ఖుర్‌ఆన్ ఆదేశమేదో చూపండి," నాల్గో కొరడాపై "లన్ యుసబనా ఇల్లా మా కతబల్లాహులనా" (మాపై ఏ ఆపద వచ్చినా దాన్ని దైవం మన విధివ్రాతలో వ్రాసిపెట్టిందే) అన్నారు.

ఇలా అనడంలో వారి ఉద్దేశ్యమేమంటే, "దైవం, నా నొసటన వ్రాసినదాని పట్ల నేను నా సమ్మతిని తెలియజేస్తున్నాన"ని చెప్పటమే.

ఈ విధంగా వారిపై 29 కొరడా దెబ్బలుపడి, 30వ దెబ్బ వారి పైజామా ముడిపై పడి, ముడి విడిపోయింది. ఇమామ్ సాహెబ్ మొదట్నుంచీ ఎంతో లజ్జాగుణం కలవారు కావడాన పైజామా ఊడిపోతుందనే భయంచేత వారు దైవంతో ఇలా మొరపెట్టుకున్నారు: "ఓ దేవా! నేను సత్యవంతుణ్ణే అయితే, నన్ను నగ్నంగా చెయ్యకుండా కాపాడు" అని. ఈ దుఆ చేసిన వెంటనే వారి పైజామా పైకి సర్దుకుంది. దీన్ని గమనించి ఖలీఫా లోపలికి వెళ్ళిపోయాడు. తరువాత సిపాయిలు వీరిని జైల్లో బంధించారు. వీరిపై రోజురోజుకు పెరుగుతున్న కష్టాలు, దౌర్జన్యాల్ని బగ్దాదు ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. ఆ రోజు వాతావరణమే మారిపోయింది. ప్రజలు ఎదురుతిరిగి జైలు వద్ద బైఠాయించారు. అందరూ, "ఒకవేళ ఇమామ్ సాహెబే గనక చనిపోతే ఖలీఫాపై ప్రతీకారం తీర్చుకుంటాం" అని నినదించారు.

ఈ మాటలు విని ఖలీఫా అదిరిపడ్డాడు. తన తరఫున ఓ ఆలిమ్‌ని పిలిపించాడు. ప్రజలు ఆ ఆలిమ్‌ని కూడా ఆదరించేవారే. అందుచేత వారి నోటనే ఇమామ్ సాహెబ్ క్షేమంగానే ఉన్నారని ప్రజలకు తెలియజేశాడు, అప్పుడు గాని ప్రజలు వాపసు వెళ్ళలేదు.

తరువాత ఎవరో ఇమామ్ సాహెబ్‌ని అడిగారు - మీ దుఆ ఇంత త్వరగా స్వీకరింపబడటానికి కారణమేమిటని. సమాధానంగా, "నా సత్యసంధత, ధర్మసంపాదన, ఇంకా దైవ సన్నిధిలో నా మనోవేదన" అని అన్నారు ఇమామ్ సాహెబ్.

ఇమామ్ సాహెబ్ మొత్తం మీద ఎన్నో సంవత్సరాలుగా బాధల్ని అనుభవించారు. వాసిఖ్ తరువాత ముతవక్కల్ ఖలీఫా అయి ఇమామ్ సాహెబ్‌ను జైలు నుండి విడుదల చేశాడు. ముతవక్కల్ ఇమామ్‌గారి మనిషి.

ఖలీఫా అయ్యేంత వరకు ఊపిరి బిగపట్టి ఉన్నాడు. ఇతను ఇమామ్ సాహెబ్‌ను ఎంతో గౌరవించాడు. వారిపై ధనధాన్యాల వర్షాన్ని కురిపించాడు. దీనిపై ఇమామ్ సాహెబ్ ఆశ్చర్యపోయి అన్నారు - ఈ దయాదాక్షిణ్యాలు కొరడా దెబ్బల కంటే కఠినంగా ఉన్నాయి అని.

ఇలా అనడంలో భావమేమిటంటే, అతని దయాదాక్షిణ్యాల ఆసరాలో తప్పుడు మాటను కూడా అంగీకరించాల్సొస్తుందని.

ఇమామ్ సాహెబ్‌పై, వారిని అనుసరించేవారిపై దైవం తన కారుణ్యాను గ్రహాల్ని కురిపించుగాక!

-: సమాప్తం :-